విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :100 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 30 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

## ఖర్గే సభా వేదికను శుద్ధి చేయడం నేరమే



- వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి: రాహుల్ డిమాండ్
- ఖర్గే సభా వేదికను శుద్ధి చేయడంపై రాహుల్ ఆగ్రహం
- బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు పెట్టాలని డిమాండ్
- బీజేపీ, ఆర్ఎస్ఎస్ వైఖరి అంటరానితనానికి మరో రూపం

## ఎల్ఓసీ వద్ద పాక్ డ్రోన్ కలకలం



- సరిహద్దు వెంబడి ఐదుగాల ముమ్మర గాలింపు
- మెంధర్ సెక్టార్‌లోని బాలాకోట్ ప్రాంతంలో డ్రోన్ గుర్తింపు
- సరిహద్దు దాటి పాక్ వైపు వెళ్లినట్లు అధికారుల వెల్లడి
- అనుమానాస్పద కదలికలపై ఉధంపూర్, కథువా, రాజౌరిలోనూ సెర్చ్ ఆపరేషన్లు



## మహా విధ్వంసం

- ప్రళయం మిగిల్చిన విషాదం
- సర్వం కోల్పోయి, గల్లంతైన ఆప్తుల కోసం అన్వేషిస్తున్న నేపాల్‌లోని కుటుంబాలు
- నేపాల్ ఆకస్మిక వరదలు
- 600 దాటిన మృతుల సంఖ్య
- శవాల ఫొటోల వద్ద కుటుంబాల రోదనలు
- మరోవైపు ఆసుపత్రుల వెలుపల, చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వివరాలను చూసేందుకు కుటుంబాలు బారులు తీరుతున్నాయి

# గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్లు




- మీ హెల్త్ మీ ఫోన్‌లోనే
- గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత ప్రభుత్వానిది
- అల్లూరి జిల్లా అరకులోయ మండలంలో సీఎం చంద్రబాబు పర్యటన
- గన్నెలలో 10 ఆరోగ్య రథాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ఏజెన్సీలో సంజీవని కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం

**అమరావతి**

ఏజెన్సీ ప్రాంతానికి వస్తే కొత్త శక్తి, ఉత్సాహం వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అల్లూరు జిల్లా అరకులోయ మండలం గన్నెలలో 10 ఆరోగ్య రథాలను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఏజెన్సీలో సంజీవని కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అరకులోయ మండలం గన్నెలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చామన్నారు. ఆ రోజుల్లోనే ఆయుర్వేద వైద్యం గిరిజనులకు అందించిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని గుర్తు చేశారు. ఆయన సేవలకు గుర్తుగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఆయన పేరు పెట్టామని స్పష్టం చేశారు. "సంజీవని" యాప్ ఓ గేమ్ ఛేంజర్ అని సీఎం చంద్రబాబు అన్నారు. మీకు అనారోగ్యం వస్తే విశాఖ, పాడేరు వెళ్లాల్సి

వివరాలు 2లో..




## మరో నాలుగు లక్షల కొత్త ఇళ్లు మంజూరు

- మరో 10 రోజుల్లో పూర్తి కానున్న ప్రక్రియ
- కొత్తగా 4 లక్షల గ్రామీణ ఇళ్లు
- వారం, పది రోజుల్లో మంజూరుకు అవకాశం
- పీఎంఏవై 2.0 కింద ఇచ్చేందుకు కేంద్రం సుముఖం

## బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై డబ్ల్యూహెచ్ఓ అలర్ట్

- భారత్ అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు సూచన
- భారత్‌లో పెరుగుతున్న స్వైన్‌ఫ్లూ వ్యాప్తి
- అంతలోనే బర్డ్‌ఫ్లూ అలర్ట్ ఇచ్చిన ప్రపంచ ఆరోగ్య సంస్థ
- భారత్ వన్ హెల్త్ విధానాన్ని బలోపేతం చేయాలని సూచించిన ఆరోగ్య నిపుణులు



## ఎంబీబీఎస్, బీడీఎస్ ఫీజులు 10 శాతం పెంపు




- వైద్య విద్య కోర్సులకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలో వసూలు చేయాల్సిన ఫీజులను ప్రకటించిన ప్రభుత్వం
- సూపర్ స్పెషాలిటీ కోర్సులకు 15 శాతం ఫీజు పెంపుదల చేస్తున్నట్లు ఉత్తర్వులు
- వైద్యవిద్య కోర్సుల ఫీజులు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం
- కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్

**అమరావతి**

రాష్ట్రంలో వైద్య విద్య కోర్సులకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలో వసూలు చేయాల్సిన ఫీజులను ప్రభుత్వం ప్రకటించింది. తొలి విడత కౌన్సెలింగ్ నిర్వహణకు దీనితో మార్గం సుగమమైంది. గతేడాదితో పోలిస్తే ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు 10 శాతం, పీజీ మెడికల్ కోర్సులకు 15 శాతం, సూపర్ స్పెషాలిటీ కోర్సులకు 15 శాతం పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈమేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండ్యన్ ఆదేశాలిచ్చారు. రాష్ట్రంలో వైద్య విద్య కోర్సులకు ప్రైవేట్ కళాశాలల్లో ఫీజులను నిర్ణయించారు. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు గతేడాది కంటే 10 శాతం, పీజీ కోర్సులకు, సూపర్ స్పెషాలిటీ కోర్సులకు 15 శాతం ఫీజు పెంపుదల చేస్తున్నట్టు ఉత్తర్వులు వెలువరించారు. ఎంబీబీఎస్ కన్వీనర్

వివరాలు 2లో..



## హిమాలయాల్లో 'మంచు' ముప్పు

- భారత్‌లో 195 హైరిస్క్ సరస్సులు
- బద్దలైతే జలప్రళయమే!
- హిమాలయాల్లో 7,500 హిమానీనద సరస్సులు
- భారత్‌లో 195 సరస్సులు అత్యంత ప్రమాదకరంగా గుర్తింపు
- సిక్కింలోనే 25 హైరిస్క్ సరస్సులు
- గంగా పరివాహక ప్రాంతంలో 4,700 సరస్సులు

# ప్రపంచ స్థాయి పోటీల్లో పాల్గొనేలా..

- పిల్లల చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలి
- అమరావతి ఛాంపియన్ షిప్ ముగింపు కార్యక్రమం
- వేడుకల్లో పాల్గొన్న పలువురు ప్రముఖులు
- విజేతలకు నగదు బహుమతిని అందజేసిన ప్రముఖులు



**అమరావతి**

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం శ్రీనివాస ఆడిటోరియంలో శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్-2026 రాష్ట్రస్థాయి ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర నలు మూలల నుంచి వచ్చిన క్రీడాకారుల సందడితో ఆడిటోరియం క్రీడా సంబరాలను తలపించింది. విజేతలకు నగదు బహుమతులు, ప్రోత్సాహకాలు అందజేయడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు తదితరులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటాలకు నివాళులర్పించారు. రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్‌లో విజేతలైన క్రీడాకారులకు

వివరాలు 2లో..

# మరో నాలుగు లక్షల కొత్త ఇళ్లు మంజూరు

రాష్ట్రంలోని ఇళ్లు లేని గ్రామీణ పేదలకు కూటమి ప్రభుత్వం త్వరలో శుభవార్త అందించనుంది. రాబోయే వారం లేదా పది రోజుల్లో 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎమ్?ఏవై) గ్రామీణ-2.0' పథకం కింద కేంద్రం రాష్ట్రానికి మరో 4 లక్షల కొత్త ఇళ్లను మంజూరు చేసే అవకాశం ఉంది. రాష్ట్ర అధికారులు ఇప్పటికే అర్హులైన లబ్ధిదారుల వివరాలను కేంద్రానికి సమర్పించారు. దీనిపై కేంద్ర గృహనిర్మాణ శాఖ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. పీఎమ్?ఏవై-2.0 కింద రాష్ట్రానికి ఇప్పటికే 77,000 ఇళ్లు మంజూరయ్యాయి. అదనంగా మరో 4 లక్షల ఇళ్లను కేంద్రం మంజూరు చేసిన తర్వాత, మొత్తం కేటాయించిన ఇళ్లను జిల్లాల వారీగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.

**రాష్ట్ర ప్రభుత్వ చొరవతో**

'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్)-1.0' పథకం కింద రాష్ట్రానికి సుమారు 19 లక్షల ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 2024కు ముందు మంజూరైన 3.71 లక్షల ఇళ్ల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదని కేంద్రం గుర్తించింది. ఇవి కాకుండా, మరో 4 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలను కేటాయించడం వల్ల, చాలా మంది ఇళ్లు నిర్మించుకోవడానికి వెనుకాడుతూ వచ్చారు. లక్షలాది ఇళ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో, కొత్త ఇళ్లను మంజూరు చేయడానికి ముందు పాత ఇళ్ల నిర్మాణం పూర్తయినట్లు నిర్ధారించే నివేదిక అవసరమని కేంద్రం పట్టుబట్టింది

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కొత్త ఇళ్ల మంజూరుకు ఈ సమస్య ప్రధాన అడ్డంకిగా మారింది. ఫలితంగా మొదటి దశలో కేవలం 77,000 ఇళ్లు మాత్రమే మంజూరయ్యాయి. అయితే రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలు సుమారు 9 లక్షల మంది ఉన్నందున, కూటమి



ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని వారికి ఇళ్ల కేటాయింపులు సాధించేందుకు కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరిపింది. దీని ఫలితంగా, కేంద్రం తన వద్ద ఉన్న 25 లక్షల ఇళ్ల 'బఫర్ స్టాక్' (అదనపు నిల్వ) నుంచి 4 లక్షల ఇళ్లను విడుదల చేయడానికి అంగీకరించినట్లు సమాచారం.

**లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు:**

"వైఎస్సార్సీపీ ప్రభుత్వం అస్తవ్యస్త స్థితిలో వదిలేసిన గృహనిర్మాణ లేఅవుట్లను నివాసయోగ్యంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గృహనిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి తెలిపారు. ఈ పనులకు అవసరమైన నిధుల అంచనాలను సిద్ధం చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించిందని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడలోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. లేఅవుట్లలో ఇంకా గృహ నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారుల వివరాలను సేకరించాలని అసిస్టెంట్ ఇంజనీర్లను ఆయన ఆదేశించారు. 'పీఎం -జన్‌మన్' పథకం కింద ఆదివాసీల కోసం మంజూరైన 43,592 ఇళ్ల నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు, అలాగే ఈ పనిని పర్యవేక్షించేందుకు తొమ్మిది జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశించారు'

# స్థానిక పోరుకు జనసేన సిద్ధం

**కాకినాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి క్రమంగా రాజుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయంతో అధికారంలోకి వచ్చిన జనసేన పార్టీ, రాబోయే స్థానిక పోరులోనూ అదే ఊపును కొనసాగించడమే లక్ష్యంగా కీలక కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగానే శుక్రవారం సాయంత్రం కీలక ఆత్మీయ సమావేశం నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఎన్నికల వ్యూహాలకు పదును పెట్టడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశం. ఈ విస్తృత స్థాయి సమావేశానికి జనసేన ప్రజాప్రతినిధులు, కీలక నేతలు హాజరుకానున్నారు. పార్టీకి చెందిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు , శాసనసభ్యులు , ఎమ్మెల్సీలతో పాటు వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా ఎంపికైన నేతలకు పిలుపునిచ్చారు. వీటితో పాటు గత కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన సీనియర్లకు సముచిత ప్రాధాన్యం ఇస్తూ.. 2019 సార్వత్రిక ఎన్నికలు, 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసిన మాజీ అభ్యర్థులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపారు. ఈ వేదికగా స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాలు, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై రూపొందించిన 14 మంది సభ్యుల ప్రత్యేక కమిటీ సమగ్రంగా చర్చించనుంది. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్దేశించిన మార్గదర్శకాలను, ఆయన సందేశాన్ని పార్టీ పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ నేతలకు కూలంకషంగా వివరించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి తరఫున సీట్ల సర్దుబాటు, అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు మరియు క్షేత్రస్థాయి సమన్వయంపై నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ నిలబడి పోరాడిన కేడర్‌కు స్థానిక సంస్థల్లో ప్రాధాన్యం కల్పించడంపై ఈ సమావేశంలో ప్రాథమిక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. గల్లీ స్థాయి నుంచి క్షేత్రస్థాయి నాయకత్వాన్ని రీచార్జ్ చేస్తూ, గ్రామ పంచాయతీ నుంచి జిల్లా పరిషత్, మున్సిపల్ పీఠాల వరకు విజయం సాధించడమే లక్ష్యంగా జనసేన వ్యూహరచన చేస్తోంది. పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అభ్యర్థులను ఖరారు చేయడంపై ఈ ఆత్మీయ సమావేశం ఒక దిక్సూచిలా మారబోతోంది. జనసేన 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో గత ఎన్నికల్లో గెలిచింది. అయితే ఈసారి మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో పట్టున్న ప్రాంతాలను ఎంచుకోవాలని జనసేన భావిస్తుంది. అందుకు అవసరమైతే టీడీపీపై వత్తిడి కొంత పెంచి ఎన్నికలలో పోటీ



చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే పవన్ కల్యాణ్ వీరమహిళలు, జనసైనికులకు సంతృప్తి కలిగేలా వాటా ఉంటుందని, అదే సమయంలో కూటమి మధ్య మిత్రత్వాన్ని కొనసాగిస్తూనే అవసరమైన సీట్లను సాధించడం కోసం పట్టుబడతామని చెప్పింది. అయితే చూచాయగా అందిన సమాచారం మేరకు జనసేన ఏపీలోని పదహారు కార్పొరేషన్లలో ఐదింటిలో పోటీ చేయాలని భావిస్తుంది. ఇప్పటికే దీనిపై ఒక అభిప్రాయానికి వచ్చిన జనసేన కార్పొరేషన్ లలో తాము పోటీ చేసే స్థానాల విషయంలో క్లారిటీకి వచ్చినట్లు ఉందని పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ, కాకినాడ, తిరుపతి, ఒంగోలు,. ఏలూరు కార్పొరేషన్లనలో మేయర్ పదవిని జనసేన కోరే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే మొత్తం పదహారు కార్పొరేషన్లలలో ఐదు అంటే ఎక్కువేనని టీడీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. విజయవాడ కార్పొరేషన్ ను వదులుకునేందుకు టీడీపీ సిద్ధంగా ఉండదు. అలాగే ఏలూరు కార్పొరేషన్ విషయంలోనూ టీడీపీ పట్టుబట్టే అవకాశముంది. ఇక తిరుపతి విషయంలో గత శాసనసభ ఎన్నికల్లో అసెంబ్లీ స్థానం కేటాయించాం కాబట్టి ఈ సారి మేయర్ స్థానం తమకు ఇవ్వాలని జనసేన ముందు టీడీపీ కొంత ప్రతిపాదన పెట్టే అవకాశముంది. ఇక కాకినాడ కార్పొరేషన్ లో ఎటువంటి ఇబ్బందులు లేవు. అలాగే ఒంగోలు కార్పొరేషన్ ను కూడా టీడీపీ వదులుకునేందుకు సిద్ధపడకపోవచ్చు. అక్కడ పట్టు పోకుండా ఉండాలంటే కార్పొరేషన్ తమ గ్రిప్ లో ఉంచుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ పట్టుబట్టవచ్చు. ఇవి కాకుండా మిగిలిన చోటా చోటా కార్పొరేషన్లకు ఇచ్చేందుకు టీడీపీ సిద్ధపడవచ్చు. ఐదు కార్పొరేషన్లకు మూడు కార్పొరేషన్లు జనసేనకు కేటాయించే అవకాశాలున్నాయి. ఉత్తరాంధ్రలోనూ, రాయలసీమలోనూ కొన్ని చోట్ల కేటాయించే ఛాన్స్ ఉంది. అంతే తప్ప తమకు బలం ఉన్న స్థానాలను పొత్తులో భాగంగా వదులుకోకూడదన్న అభిప్రాయం కూడా టీడీపీ నేతల్లో ఉంది. ఐదు కార్పొరేషన్లు అడిగితే మూడు ఇస్తారన్నది జనసేన వ్యూహం కావచ్చు. అదే జరిగితే జనసేన కోరినవి కాకుండా దాని బలం అంచనా వేసి కాకినాడతో పాటు మరొక రెండు కార్పొరేషన్లు కోరే అవకాశముందని తెలిసింది. మొత్తం మీద జనసేన మాత్రం కొంత స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టిగానే స్థానాలను కోరాలని భావిస్తుంది. జనసేనఐదు కార్పొరేషన్లను తీసుకోగలిగితే 31.25 శాతం షేరింగ్ అవుతుంది. మరొకవైపు పవన్ కల్యాణ్ పై జనసైనికుల నుంచి కూడా ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో జనసేన ఏ రకంగా సీట్ల షేర్ సాధిస్తుందన్నది ఇప్పుడు అందరిలోనూ ఉత్కంఠ నెలొకొంది.

# అనిల్ లో నిర్వేదం..

**నెల్లూరు :** పదవి ఉన్నా లేకపోయినా తనకో చరిత్ర ఉందని వైసీపీ ఆఫీసులో కూర్చుని పోసుకోలు కబుర్లు చెప్పిన అనిల్ కుమార్ మాటల నిర్వేదం వెనుక అసలు రహస్యం.. స్థానిక ఎన్నికల విషయంలో ఆయనకు నెల్లూరు సిటీలో అసలు బాధ్యతలే ఇవ్వకపోవడం. మున్సిపల్ ఎన్నికల్లో ఏకగ్రీవాలు జరిగితే తాను పోటీ చేయనంటూ ఆయన చేసిన ప్రకటనలు.. సొంతంగా బాధ్యత తీసుకోవడానికి చేసిన ప్రయత్నం అని వైసీపీ వర్గాలంటున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమన్వయ బాధ్యతలను పార్టీ అధిష్టానం ఆయనకు అప్పగించలేదు. ఆయన ఇంచార్జ్ కూడా కాదు. తాను ఏదో బాధ్యత తీసుకుంటున్నట్లు ఫోజు కొడుతూ చేసిన ప్రకటనలు కేవలం రాజకీయ ఉనికిని కాపాడుకునే ప్రయత్నమే. గత సార్వత్రిక ఎన్నికల నుంచి అనిల్ కుమార్ యాదవ్ రాజకీయ పరిస్థితి తలకిందులైంది. నెల్లూరు సిటీ నుంచి ఆయనను తప్పించి నరసరావుపేట ఎంపీగా బరిలోకి దించగా, అక్కడ ఘోర పరాజయం పాలైన తర్వాత ఆయన అటువైపు వెళ్లడం పూర్తిగా మానేశారు. తిరిగి తన సొంత ఇలాకా అయిన నెల్లూరులో పట్టు నిలుపుకుందామంటే, అక్కడ స్థానిక వైసీపీలో రెడ్డి నేతలు ఆయనను కనీసం కాలుమోపనివ్వకుండా అడ్డుకుంటోంది. దీంతో చేతిలో అసెంబ్లీ నియోజకవర్గం లేక, ఎంపీగా ఓడిపోయిన ప్రాంతానికి వెళ్లలేక అనిల్ తీవ్ర రాజకీయ శూన్యతను ఎదుర్కొంటున్నారు. మరోవైపు, నెల్లూరు సిటీ నియోజకవర్గంపై పట్టు బిగించేందుకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఇప్పటికే దూకుడు పెంచారు. వచ్చే



అసెంబ్లీ ఎన్నికల్లో నెల్లూరు సిటీ టికెట్‌ను లక్ష్యంగా చేసుకున్న పర్వతరెడ్డి, తాజాగా స్థానిక సమరానికి సంబంధించి నెల్లూరు సిటీ బాధ్యతలన్నింటినీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనకే అప్పగించారంటూ బహిరంగంగా ట్వీట్ చేయడం అనిల్ వర్గానికి పెద్ద షాక్‌గా మారింది. కార్పొరేషన్ వ్యవహారాల్లో చక్రం తిప్పుదామనుకున్న అనిల్ ఆశలపై ఈ పరిణామం నీళ్లు చల్లినట్లయింది. పార్టీ పెద్దల నుంచి వచ్చిన ఈ స్పష్టమైన సంకేతంతో నెల్లూరు సిటీలో అనిల్‌కు రాజకీయంగా ద్వారాలు మూసుకుపోయినట్లేనని స్పష్టమవుతోంది. ఎలాగైనా తిరిగి నెల్లూరు సిటీ రాజకీయాల్లోకి రావాలని చూస్తున్న అనిల్ ప్రయత్నాలన్నీ వరుసగా బెడిసికొడుతున్నాయి. ఒకప్పుడు నెల్లూరు జిల్లా రాజకీయాల్లో మంత్రిగా చక్రం తిప్పి, ప్రత్యర్థులపై విరుచుకుపడిన ఆయన, నేడు సొంత పార్టీలోనే ఏ బాధ్యతా లేని స్థితికి దిగజారడం గమనార్హం. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సరైన నియోజకవర్గం లేక, నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల బాధ్యతలను సైతం ప్రత్యర్థి వర్గం దక్కించుకోవడంతో అనిల్ రాజకీయ భవిష్యత్తు పూర్తిగా అగమ్యగోచరంగా మారింది.

## గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్లు

-మొదటిపేజీ తరువాయి

వచ్చేదన్నారు. ఇప్పుడు మీ ఆరోగ్యం మీ ఫోన్‌లో ఉందని, ఎక్కడికి వెళ్లినా మీ ఆరోగ్యం ఫోన్‌లో చెక్ చేసుకోవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్?ను క్రోడీకరించి ఆరోగ్యాన్ని రక్షిస్తామన్నారు. ప్రతి ఒక్క గిరిజన బిడ్డకు మెరుగైన ఆరోగ్యం ఇవ్వాలని సంకల్పించామన్నారు. గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. ఏజెన్సీ ఏరియాలో మరికొన్ని సెల్ టవర్లు పెట్టించి కనెక్టివిటీ పెంచుతామన్నారు. 3 నెలల్లో అల్లూరి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. "ఏ వైద్య పరీక్ష అయినా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిపేలా ఏర్పాట్లు చేస్తాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే. గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తున్నాం. దీంతో నేను సంతృప్తి చెందడం లేదు. గిరిజన ప్రాంతంలో ఉన్న ఉద్యోగాలన్నీ గిరిజనులకే దక్కాలనేది ఈ ప్రభుత్వ విధానం. అందరికీ ఆమోదయోగ్యమైన జీవోను మళ్లీ తీసుకువస్తామని హామీ ఇస్తున్నా. వీలైనంత త్వరగా అన్ని గ్రామాలకు రోడ్లు వేసేలా చర్యలు తీసుకుంటాం. అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చాం. ఏజెన్సీ ప్రజలకు ఆదాయం అరకు కాఫీ, మిరియాల నుంచి వస్తోంది" అని సీఎం తెలిపారు.

**పారదర్శకంగా 16 వేలమందికి పోస్టులిచ్చాం**

ఒక్క రూపాయి కూడా అవినీతి జరగకుండా డీఎస్సీ నిర్వహించామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పారదర్శకంగా 16 వేలమందికి టీచర్ పోస్టులిస్తే ఏడాది తర్వాత గొడ్డలి పార్టీ రాద్ధాంతం చేస్తోందని ధ్వజమెత్తారు. వైఎస్సార్సీపీ హయాంలో ఏపీపీఎస్సీలో అక్రమాలకు పాల్పడి, నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు గన్నెల పంచాయతీ ఆర్.కె.నగర్‌లో ప్రజలతో సీఎం చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలు, ఇతర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. గర్భిణీతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ గ్రామంలో 47 ఇళ్లు, 189 మంది జనాభా ఉండగా, ఇక్కడ పాపులేషన్ మేనేజ్‌మెంట్ బాగుందని, అందుకు గల విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఓ మహిళ తన కుమార్తె నీట్ శిక్షణలో ఉందని తెలుపగా శెభాష్ అన్న ముఖ్యమంత్రి. అందరూ ఇదే స్ఫూర్తితో పిల్లలని చదివించాలన్నారు. మహిళలతో మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు కోసం ఏం చేస్తున్నారు? ఏం చేయబోతున్నారు? అని ప్రశ్నించారు. ఆర్.కె.(రామకృష్ణ) నగర్ లో మొత్తం 16 మందితో సీఎం మాట్లాడారు. వారందరీ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు మీ వరకు చేరుతున్నాయా అని ఆరా తీశారు. చంద్రబాబు రాకను పురస్కరించుకొని ఆర్.కె.నగర్ మహిళలు, చిన్నారులు థింసా నృత్యంతో స్వాగతం పలికారు.

## ఎంబీబీఎస్, బీడీఎస్ ఫీజులు 10 శాతం పెంపు

-మొదటిపేజీ తరువాయి

కోటా ఏ-కేటగిరికి రూ. 18,150, బీ-కేటగిరికి (మేనేజ్‌మెంట్ కోటా) రూ.14.52లక్షలు, సీ-కేటగిరి(ఎన్నారై కోటా) రూ.43.56 లక్షల ఫీజులను నిర్ణయించారు. బీడీఎస్ కన్వీనర్ కోటా ఏ-కేటగిరికి రూ.15,730, బీ-కేటగిరికి రూ.4.84లక్షలు, సీ-కేటగిరికి రూ. 14.52 లక్షలుగా నిర్ణయించారు.

**మెడికల్ పీజీ కోర్సులకు**

మెడికల్ పీజీ కోర్సులకు క్లినికల్ డిగ్రీ ఏ-కేటగిరికి రూ.5,71,320, బీ-కేటగిరికి రూ.11,42,640, సీ-కేటగిరికి రూ.66,12,500 పారాక్లినికల్ డిగ్రీ, డిప్లమా ఏ-కేటగిరికి రూ.1,78,538, బీ-కేటగిరికి రూ.3,57,075, సీ-కేటగిరికి రూ.19,83,750 ప్రీ క్లినికల్ డిగ్రీ ఏ-కేటగిరికి రూ.80,937, బీ-కేటగిరికి రూ. 1,61,874, సీ-కేటగిరికి రూ.10,58,000గా నిర్ణయించారు. డెంటల్ క్లినికల్ పీజీ డిగ్రీ ఏ-కేటగిరికి రూ. 3,92,783, బీ-కేటగిరికి రూ.7,85,565, సీ-కేటగిరికి రూ.15,87,000 కాగా, పారా క్లినికల్ డెంటల్ పీజీ ఎ-కేటగిరికి రూ.3,53,504, బీ-కేటగిరికి రూ.5,74,759, సీ-కేటగిరికి రూ.9,25,750 నిర్ణయించారు. సూపర్ స్పెషాలిటీ కోర్సులకు జీఎస్ఎల్, కస్తూరి, నారాయణ, ఎన్నారై, డాక్టర్ సిద్దార్థ మెడికల్ కళాశాలల్లో రూ. 19,83,750 ఫీజు ఉంటుందని ఉత్తర్వులలో తెలిపారు. ఈమేరకు మూడు వేర్వేరు జీవోలను రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కార్యదర్శి వీరపాండ్యన్ విడుదల చేశారు.

**కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్**

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ కోర్సులో కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొదటి విడత కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఆప్షన్ల నమోదుకు షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇవాళ ప్రకటించిన తుది మెరిట్ జాబితాలో పేరున్న అభ్యర్థులందరూ వెబ్?ఆప్షన్లు ఇవ్వడానికి అర్హులని వెల్లడించింది.

## ప్రపంచ స్థాయి పోటీల్లో పాల్గొనేలా

-మొదటిపేజీ తరువాయి

స్పీకర్ అయ్యన్నపాత్రుడు రూ.92 లక్షల ప్రైజ్ మనీ అందజేశారు. అలాగే జాతీయ, అంతర్జాతీయ వేదికల్లో పతకాలు సాధించిన 264 మంది క్రీడాకారులకు రూ.8.80 కోట్ల ప్రోత్సాహకాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రీడలు ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, ఓర్పు, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని చెప్పారు. ఆటలతో భవిష్యత్తు ఉండదనే అపోహను వీడాలని, క్రీడలను చదువుతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో మరింత ప్రాధాన్యం కల్పించేలా క్రీడా కోటా పెంపుపై అసెంబ్లీలో తీర్మానం తీసుకొస్తామని ప్రకటించారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడారంగానికి పూర్వవైభవం తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అమరావతిలో 500 ఎకరాల్లో అత్యాధునిక స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతోందని, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలోనూ భారీ క్రీడా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రపంచ స్థాయి పోటీల్లోనూ ఆంధ్రప్రదేశ్ నుంచి క్రీడాకారులు పాల్గొనేలా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి తీర్చిదిద్దేందుకు శాప్ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. పాఠశాలల్లో క్రీడా మైదానాలు, వాకింగ్ ట్రాక్‌లు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**ఆసియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు**

మరోవైపు అమరావతి ఛాంపియన్‌షిప్‌కు ఆసియా బుక్ ఆఫ్ రికార్డు దక్కింది. ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి హరీష్ చేతుల మీదుగా క్రీడలశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు అందుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ ఛాంపియన్‌షిప్‌లో 26 జిల్లాల నుంచి అండర్-17, అండర్-23 విభాగాలకు చెందిన 9 వేలకుపైగా బాలబాలికల క్రీడాకారులు పాల్గొని పోటీలను విజయవంతం చేశారు.

## తగ్గేదెలా... అంటున్న కడప రెడ్డమ్మ

**కడప :** కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. కడపలో తనకు వైసీపీ పోటీయే కాదని ఆమె చేసిన వ్యాఖ్యలు అతివిశ్వాసమా? మరేదైనా కారణమా? అన్న చర్చ జరుగుతుంది. ఒక యూట్యూబ్ ఛానెల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కడప నియోజకవర్గంలో తనకు వైసీపీ పోటీయే కాదని, తనను ఓడించే సత్తా ఆ పార్టీకి లేదని చెప్పడాన్ని పలువురు అతి విశ్వాసంగానే చూస్తున్నారు. ఎందుకంటే మహామహులే ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. జాతకాలు తిరగబడ్డాయి. అందులో తొలిసారి ఎన్నికయిన మాధవిరెడ్డి ఎంత? అని సోషల్ మీడియాలో కామెంట్స్ వినపడుతున్నాయి. వైసీపీ తనకు పోటీ యే కాదని చెప్పడం గర్వం తలకెక్కిందనడానికి కారణమని, అంతగా రెచ్చిపోతే ప్రజలే బుద్ధి చెబుతారని వైసీపీ సోషల్ మీడియాలో హెచ్చరిస్తున్నారు. అయితే కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి దూకుడుగా మరియు ఆత్మవిశ్వాసంతోఉండటానికి ప్రధానంగా రాజకీయ నేపథ్యం, చారిత్రక విజయం మరియు కుటుంబ నేపథ్యం కారణాలుగా ఉన్నాయి. రెండు దశాబ్దాల తర్వాత కడప అసెంబ్లీ సెగ్మెంట్‌లో తెలుగుదేశం పార్టీ తరఫున గెలిచిన మొదటి మహిళా ఎమ్మెల్యే ఆమె. ఆమె మామ రెడ్డెప్పగారి రాజగోపాల్ రెడ్డి ఐదు సార్లు మంత్రిగా పనిచేసిన ప్రభావశీలమైన రాజకీయ కుటుంబం నుండి రావడంతో పాటు కుటుంబ వ్యాపారాల ద్వారా కన్‌స్ట్రక్షన్ రంగంలో అనుభవం కలిగి ఉండటం, నాయకత్వ లక్షణాలు ఉండటం. కూటమి ప్రభుత్వంలో కడప అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టడం, పవర్‌ఫుల్ స్పీచ్‌లు ఇస్తూ దూకుడు ప్రదర్శించడం వంటివి తనకు అనుకూలమని మాధవి రెడ్డి భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత మాధవి రెడ్డి అనేక వివాదాల్లో చిక్కుకున్నారు.

# క్రీడలలో సత్తా చాటిన నక్కపల్లి హై స్కూల్ విద్యార్థులు





**నక్కపల్లి, పెన్ సత్తా ఆగష్టు29:**జిల్లా స్పోర్ట్స్ అధారిటీ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించిన క్రీడా పోటీల్లో నక్కపల్లి హై స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. జిల్లా పోటీల్లో 5 స్థానాల్లో స్థానిక బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థులు 5 వ స్థానం కైవసం చేసుకున్నట్లు హెచ్.ఎమ్. పతివాడ విజయ తెలిపారు. శనివారం జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా అనకాపల్లిలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో 5 వ స్థానం సాధించిన క్రీడాకారులకు ఎక్స్ లెన్స్ అవార్డులకు ఎంపిక చేసి జిల్లా విద్యాశాఖాధికారి చేతుల మీదుగా పురస్కారాలను అందజేశారు.క్రీడల్లో ప్రతిభను వెలికితీస్తూ క్రమశిక్షణ,ఆత్మవిశ్వాసం,నాయకత్వ లక్షణాలను పెంపొదిస్తూ జిల్లా క్రీడారంగానికి విద్యార్థులు గర్వకారణంగా నిలిచారని డి.ఈ వో. నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎంపికయిన చిన్నారులను , క్రీడల్లో శిక్షణనిచ్చిన పీడీలు నీరజ,ధనలక్ష్మిలను పాఠశాల సిబ్బంది, గ్రామపెద్దలు,తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.

# పాయకరావుపేట నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి



పోలవరం కాలువకు వైయస్సార్ పేరు పెట్టాలి
వీసం రామకృష్ణ

**నక్కపల్లి, పెన్ సత్తా, ఆగష్టు 29:** పాయకరావుపేట నియోజకవర్గం లో ఉన్న నాలుగు మండలాలను కరువు ప్రాంతంగా ప్రకటించాలని వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం నక్కపల్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం అయన మాట్లాడుతూ వర్షా బావ పరిస్థితి వల్ల పాయకరావుపేట నియోజకవర్గం లో నక్కపల్లి,ఎస్ రాయవరం, పాయకరావుపేట, కోటవురట్ల మండలాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ఏడాది రబీలో కూడా వర్షాలు లేకపోవడం వల్ల మెట్ట ప్రాంతాల్లో ఉన్న జీడీ మామిడి రైతులు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నారు అన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ వర్షాలు లేకపోవడం వల్ల వరి నారుమడులు ఎండిపోయాయని తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గ ప్రతినిధిగా రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాంతాన్ని కరువు మండలంగా ప్రకటించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన కోరారు. వ్యవసాయ పెట్టుబడుల నిమిత్తం బ్యాంకుల్లో తీసుకున్న రైతుల రుణాలను రీ షెడ్యూల్ చేసి కొత్త రుణాలు ఇచ్చేలాగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం వర్షా బావ పరిస్థితి వల్ల రైతులు వరి పంటల నష్టపోవడంతో పాటు పశుగ్రాసానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం రైతులకు రాయితీపై పశుగ్రాసం, దానా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**పోలవరం కాలువకు వైయస్సార్ పేరు పెట్టాలి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతాంగానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో దివంగత మహానేత, రైతు బాంధవుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి సంకల్పించిన పోలవరం కాలువకు వైయస్సార్ పేరు పెట్టాలని వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర రైతాంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి పోలవరం కాలువ నిర్మాణానికి సంకల్పించారన్నారు. ఆయన పాలనలో పోలవరం కాలువ నిర్మాణానికి కావలసిన భూసేకరణ, 50% కాలువ నిర్మాణం పనులను పూర్తి చేశారని ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మరో 25శాతంతో పోలవరం కాలువ నిర్మాణపు పనులు 75% పూర్తి చేశారని గుర్తు చేశారు. రైతాంగం కోసం అపర భగీరథుడు రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన పోలవరం ఎడమ కాలువ జల హారతి కార్యక్రమానికి సెప్టెంబర్ 2న పాయకరావుపేట నియోజకవర్గానికి వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలవరం ఎడమ కాలువకు వైయస్సార్ పోలవరం కాలువగా నామకరణ చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందరావు, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, సూరకాసుల గోవిందు, అయినంపూడి మణిరాజు, సాది రెడ్డి శ్రీను, తల్లా భార్గవ్ తదితరులు ఉన్నారు.

# ధర్మవరం వన్‌టౌన్ పరిధిలో 8 మంది రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తుల బైండోవర్

ఎర్రగుంట్ల ప్రాంతానికి చెందిన 8 మందిని బైండోవర్ చేసిన పోలీసులు
ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు..
ఏడాది పాటు బైండోవర్
ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున సూరిటీ సమర్పణ
బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.5 లక్షలు ప్రభుత్వానికి చెల్లించాలి
నేరాలకు పాల్పడితే జైలు శిక్ష తప్పదని పోలీసుల హెచ్చరిక
శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు: పోలీసులు



**ధర్మవరం,ఆగస్టు 29 (పెన్ సత్తా)** శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం వన్ టౌన్ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎర్రగుంట్ల ప్రాంతానికి చెందిన 8 మంది రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తులను పోలీసులు శనివారం బైండోవర్ చేశారు. అనంతరం వారిని ధర్మవరం పట్టణ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు.
ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఒక్కొక్కరిని ఏడాది కాలానికి బైండోవర్ చేస్తూ, రూ.5 లక్షల చొప్పున సూరిటీ సమర్పించాలని ఆదేశించారు. దీంతో సంబంధిత వ్యక్తులు ధర్మవరం తహసీల్దార్ కార్యాలయంలో సూరిటీలు సమర్పించారు.
బైండోవర్ కాల పరిమితిలో సదరు వ్యక్తులు ఎలాంటి నేరాలకు పాల్పడకుండా శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ఉండాల్సి ఉంటుందని పోలీసులు తెలిపారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించి నేరాలకు పాల్పడితే సూరిటీగా సమర్పించిన రూ.5 లక్షలను ప్రభుత్వానికి చెల్లించాల్సి రావడంతో పాటు, నిబంధనల మేరకు జైలు శిక్ష కూడా అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.
ప్రజా శాంతి, భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.

# అరకు పర్యటనలో గిరిజన సమస్యలు గాలికొదిలి విద్వేష రాజకీయాలా?

**అల్లూరి సీతారామరాజు జిల్లా:ఆగస్టు 29 (పెన్ సత్తా)** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరకు పర్యటనలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనను పూర్తిగా విస్మరించి మత రాజకీయాలు, విద్వేష ప్రచారానికి తెరలేపారని వైయస్ఆర్‌సీపీ ప్రజాప్రతినిధులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధి, వైద్యం, విద్య, రహదారులు, కమ్యూనికేషన్ వ్యవస్థల గురించి మాట్లాడకుండా.. భార్యాభర్తల వ్యక్తిగత సమస్యలను పార్టీకి, మతానికి ముడిపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం ముఖ్యమంత్రి స్థాయికి తగదని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టుగుళ్ల భాగ్యలక్ష్మి శనివారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ధ్వజమెత్తారు.

**సంజీవని కాదు.. అదొక 'స్టిక్కర్ సంజీవని'**

వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో గిరిజనుల ముంగిటకే వైద్యాన్ని తీసుకెళ్లేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య భద్రత, టెలిమెడిసిన్ వ్యవస్థలను ప్రవేశపెట్టారని నాయకులు గుర్తుచేశారు. వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వం తెచ్చిన అవే సేవలకు పేర్లు మార్చి 'సంజీవని' అంటూ కొత్త స్టిక్కర్లు వేసుకోవడమేనా పరిపాలన అని ప్రశ్నించారు. పని జగన్‌మోహన్ రెడ్డిది అయితే పేరు చంద్రబాబుదా, సేవ జగన్‌ది అయితే స్టిక్కర్ బాబుదా అని ఎద్దేవా చేశారు. కేవలం పేరు మార్చుకున్నంత మాత్రాన సంజీవని అయిపోదని, ప్రజలను బతికించేది నిజమైన వైద్య సేవలేనని స్పష్టం చేశారు.

**గిరిజన ప్రాంతాలకు వెళ్లి మత రాజకీయాలు, డైవర్షన్ డ్రామాలు**

చంద్రబాబు రాజకీయ జీవితమంతా అవకాశవాదమేనని, అవసరాలకు తగ్గట్టు మాటలు మార్చడం ఆయనకు అలవాటేనని విమర్శించారు. మతం గురించి మాట్లాడే ముందు తమ పాలనలో ఆలయాల్లో జరిగిన ఘటనలు, భక్తులు ఎదుర్కొన్న ఇబ్బందులకు చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సూపర్ సిక్స్ హామీలు ఎందుకు అమలు కాలేదు? ప్రజల సమస్యలు ఎందుకు పరిష్కారం కావడం లేదు? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనే ప్రజల దృష్టిని మళ్లించేందుకు మతాన్ని, వ్యక్తిగత వివాదాలను తెరపైకి తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**గిరిజన ద్రోహిగా మారిన కూటమి ప్రభుత్వం**

గిరిజనులకు చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని వైయస్ఆర్‌సీపీ నేతలు తీవ్రస్థాయిలో ఎండగట్టారు.
వాలంటీర్ వ్యవస్థ రద్దు: మారుమూల గిరిజన గూడాల్లో ఇంటి వద్దకే పెన్షన్ అందించిన వాలంటీర్ వ్యవస్థను తీసేసి వృద్ధులను కష్టాలపాలు చేయడంతో పాటు గిరిజన యువతకు ఉపాధి లేకుండా చేశారు.
ఆర్వోఎఫ్ఆర్ రైతులకు మొండిచేయి: కేంద్రం ఇవ్వకపోయినా నాడు వైయస్ జగన్ ప్రభుత్వం ఆర్వోఎఫ్ఆర్ అటవీ పట్టాదారులైన గిరిజన రైతులకు వైయస్ఆర్ రైతు భరోసా అందించగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ సాయాన్ని తగ్గించి గిరిజన రైతుల పొట్ట కొట్టింది.
మెడికల్ కాలేజీల నిర్వీర్యం - ప్రైవేటీకరణ కుట్ర: మారుమూల ఏజెన్సీ ప్రజల కోసం వైయస్ జగన్ ప్రభుత్వం పాడేరులో మెడికల్ కాలేజీని నిర్మిస్తే, నేడు చంద్రబాబు ప్రభుత్వం మెడికల్ సీట్లు తగ్గించి గిరిజన వైద్య విద్యను దెబ్బతీస్తోంది.

# డబుల్ ఇంజిన్ కాదు.. డబుల్ రేట్ల సర్కార్

**విశాఖపట్నం:పెన్ సత్తా ఆగష్టు29** ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని వెన్నుపోటు కూటమి ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని పెంచేసి, నిత్యవసరాల ధరలతో సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని వైఎస్సార్సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. విశాఖపట్నంలోని పార్టీ సిటీ కార్యాలయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబుది 'విజనరీ పాలన' కాదని, ప్రజల నడ్డి విరిచే 'బాదుడే బాదుడు పాలన' అని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి చంద్రబాబు 'డైవర్షన్ పాలిటిక్స్' చేస్తున్నారని ఆమె దుయ్యబట్టారు. చంద్రబాబు నాయుడు జీడీపీలో రాష్ట్రాన్ని నంబర్ వన్ స్థానంలో ఉంచుతామని చెబుతున్నారని, కానీ ప్రజల దృష్టిలో జీడీపీ అంటే గ్యాస్ (+), డీజిల్ (ఇ), పెట్రోల్ (గ్రా) రేట్లను పెంచడంలో రాష్ట్రాన్ని నంబర్ వన్ చేశారని ఎద్దేవా చేశారు. మెడికల్, ఎడ్యుకేషన్ మాఫియాతో ప్రభుత్వం కుమ్మక్కైందని, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలు విడుదల చేయకపోవడంతో ప్రజలు అప్పుల పాలవుతున్నారని ఆరోపించారు. గిరిజనుల సంక్షేమం కోసం గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా వైఎస్ జగన్ గారు కృషి చేశారని, కానీ చంద్రబాబు అరకు పర్యటనకు వెళ్లి వైఎస్సార్సీపీ పథకాలకు స్టిక్కర్లు వేసుకుని 'క్రెడిట్ చోరీ'కి పాల్పడ్డారని ధ్వజమెత్తారు.
ఆమె ఇంకా ఏం మాట్లాడారంటే...

ధరల పెరుగుదలపై కనీసం సమీక్ష లేదు

వెన్నుపోటు కూటమి పాలనలో కూరగాయలు, నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్, వంట నూనెల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సామాన్యులు ఏమీ కొనలేక, తినలేక బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి కుటుంబాలు ఇబ్బందులు పడుతుంటే, ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు ఒక్క సమీక్ష కూడా నిర్వహించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఒడిశా, కేరళ కంటే మన రాష్ట్రంలోనే పెట్రోల్, డీజిల్ ధరలు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్రంలో పెట్రోల్ పై 31 శాతం స్టేట్ వ్యాట్ తో పాటు, రూ.4 అదనపు వ్యాట్, రోడ్ డెవలప్‌మెంట్ సెస్ కింద మరో రూపాయి వసూలు చేస్తున్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి లేదా స్టేట్ టాక్స్‌లు తగ్గించి ధరలు ఎందుకు దించలేకపోతున్నారో సమాధానం చెప్పాలి.

వైఎస్ జగన్ హయాంలో ధరల నియంత్రణ

గత మా వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్ గారు ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టి వినియోగదారులకు అండగా నిలిచారు. మహారాష్ట్రలో వర్షాల వల్ల టమాటా ధరలు పెరిగినప్పుడు, మా జగన్ ప్రభుత్వం కిలో రూ.150 పెట్టి రైతుల వద్ద కొనుగోలు చేసి, వినియోగదారులకు కేవలం రూ.50లకే సబ్సిడీపై అందించింది. ఐదేళ్లలో 8,460 టన్నుల టమాటాలను, రూ.69 కోట్లతో 94,335 క్వింటాళ్ల ఉల్లిపాయలను కొనుగోలు చేసి తక్కువ ధరకే ప్రజలకు మేము అందించాం. ఫోర్టిఫైడ్ గోధుమ పిండిని కిలో రూ.11లకే ఇచ్చాము. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ద్వారా రూ.7,758 కోట్లు వెచ్చించి ప్రజలకు సబ్సిడీపై సరుకులు అందించాం. కానీ, చంద్రబాబు ప్రభుత్వం మాత్రం ధరల నియంత్రణపై కనీసం ఒక్క సమీక్ష కూడా చేయలేదు.

గిరిజనుల ఖాతాలో బాబు క్రెడిట్ చోరీ

గిరిజనుల సంక్షేమం కోసం గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా మా వైఎస్ జగన్ గారు ఎంతో కృషి చేశారు. కానీ, చంద్రబాబు అరకు పర్యటనకు వెళ్లి మా వైఎస్సార్సీపీ పథకాలకు స్టిక్కర్లు వేసుకుని 'క్రెడిట్ చోరీ'కి పాల్పడుతున్నారు. ఆయన చెబుతున్న 'సంజీవని' పథకం గేమ్ చేంజర్ కాదు, అది కేవలం 'నేమ్ చేంజర్' మాత్రమే. మా జగనన్న హయాంలోనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, టెలీమెడిసిన్, డిజిటల్ హెల్త్ కార్డ్స్ తీసుకొచ్చాము. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిన విషయం గుర్తుందా? అరకు కాఫీని నేనే కనిపెట్టానని చంద్రబాబు గారు చెప్పడం చాలా హాస్యాస్పదం. 1920ల్లో బ్రిటిష్ కాలం నుంచే అరకు కాఫీ ఫేమస్ అన్న విషయం మీకు తెలియదా? గిరిజనులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలతో పాటు మా జగనన్న ఇచ్చిన రైతు భరోసాను వెన్నుపోటు కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. జగనన్న పాడేరులో 150 సీట్లతో మెడికల్ కాలేజీని నిర్మిస్తే, చంద్రబాబు వాటిని 50 సీట్లకు కుదించారు. పార్వతీపురం మెడికల్ కాలేజీని ప్రైవేట్ పరం చేయడానికి పూనుకున్నారు. ఇందుకు గాను ఆయన గిరిజనులకు వెంటనే క్షమాపణ చెప్పాలి.

మత రాజకీయాలు మానుకోవాలి

పెరిగిన నిత్యావసరాల ధరలు, పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగా మతాన్ని అడ్డుపెట్టుకుంటున్నారు. మా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మానవత్వమే మతం. రాజకీయాల కోసం, ఓట్ల కోసం మతాలను, కులాలను వాడుకునే అవకాశవాద రాజకీయం చంద్రబాబుకే చెల్లింది. గతంలో విజయవాడలో 22 గుడులను కూల్చేసిన చరిత్ర కూడా చంద్రబాబుదే. ఈ కూటమి పాలనలో సింహాచలంలో గోడ కూలి భక్తులు చనిపోయినా, కాశీబుగ్గలో తొక్కిసలాట జరిగినా, పెదకాకానిలో మంగళసూత్రాలు చోరీకి గురైనా అదంతా ఆయన ప్రభుత్వ అసమర్థతే. తక్షణమే నిత్యవసరాల ధరలను నియంత్రించాలి. లేకపోతే ప్రజల తరఫున మా వైఎస్సార్సీపీ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని వరుదు కళ్యాణి హెచ్చరించారు.ద

# కరువు, చంద్రబాబు కవల పిల్లలు

**తాడేపల్లి:పెన్ సత్తా ఆగష్టు29** సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్రంలో కరువు తాండవిస్తోందని, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయి సామాన్యుడి బతుకు భారంగా మారిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్ ధ్వజమెత్తారు. గతంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో నిత్యావసరాల ధరలను నియంత్రించి పేదలకు అండగా నిలబడ్డంతో పాటు, ధరల స్థిరీకరణ నిధి ద్వారా రైతులను సైతం ఆదుకున్నామని ఆయన గుర్తు చేశారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం ఒకవైపు రైతులను గాలికొదిలేయడంతో పాటు, మరోవైపు నిత్యావసరాల ధరల నియంత్రణలో విఫలమై ప్రజల నడ్డి విరుస్తోందని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన పుత్తా శివశంకర్ ఆక్షేపించారు.
ప్రెస్‌మీట్‌లో పుత్తా శివశంకర్ ఇంకా ఏం మాట్లాడారంటే..:

కరవు--చంద్రబాబు కవల పిల్లలు:

చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే కరువు వెంట వస్తుందనే నానుడి ఊరికే రాలేదు. ఈ వెన్నుపోటు పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ ప్రజల్లో తీవ్ర అశాంతి నెలకొంటుంది. చంద్రబాబు చుట్టూ ఉండే కోటరి, ఆయన బినామీలు తప్ప రాష్ట్రంలో ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదు. వర్షాలు లేక, ప్రాజెక్టుల నుంచి నీరు ఇవ్వలేక రాష్ట్రంలో కేవలం 20 నుంచి 25 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. మిగతా 75 శాతం ప్రాంతంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులతో రైతులు అల్లాడిపోతున్నారు. రైతులతో పాటు మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, చిరుద్యోగులు అందరి పరిస్థితి దయనీయంగా మారింది.


వంటింట్లోకి వెళ్లాలంటేనే భయపడుతున్న గృహిణులు:

నిత్యావసరాల ధరలు పెరిగిపోయి సగటు జీవి బడ్జెట్ తలకిందులైంది. నెలవారీ సంపాదనలో 40 నుంచి 50 శాతం కేవలం నిత్యావసరాలకే ఖర్చు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. వంటింట్లో వంట చేయాలంటే ఉల్లిపాయ పట్టుకుంటే కన్నీళ్లు వస్తున్నాయి, నూనె డబ్బా వైపు చూడాలంటే భయమేస్తోంది.
పంచదార: గతంలో వైయస్ జగన్ హయాంలో కేజీ రూ.35 నుంచి రూ.40 ఉంటే, నేడు ఏకంగా రూ.75కి చేరింది (దాదాపు 100% పెంపు).
బియ్యం: నాడు రూ.40 ఉన్న సాధారణ బియ్యం నేడు రూ.65 అయ్యాయి. సూపర్ ఫైన్ బియ్యం రూ.48 నుంచి రూ.75కి పెరిగింది.
పప్పు దినుసులు: మా పాలనలో రూ.100--105 ఉన్న కందిపప్పు, మినప్పప్పు ధరలు నేడు రూ.160కి చేరాయి. శనగపప్పు రూ.70 నుంచి రూ.95కి పెరిగింది.
ఉల్లిపాయలు. మిర్చి: రూ.18 ఉన్న ఉల్లిగడ్డల ధర రూ.70కి చేరింది. రూ.120 ఉన్న ఎండుమిర్చి ఏకంగా రూ.390కి పెరిగింది. రూ.10 ప్యాకెట్ ఉప్పు కూడా నేడు రూ.30 అయింది.

# స్థానిక పోరుకు జనసేన సిద్ధం

పెన్ సత్తా

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి క్రమంగా రాజుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయంతో అధికారంలోకి వచ్చిన జనసేన పార్టీ, రాబోయే స్థానిక పోరులోనూ అదే ఊపును కొనసాగించడమే లక్ష్యంగా కీలక కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగానే శుక్రవారం సాయంత్రం కీలక ఆత్మీయ సమావేశం నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఎన్నికల వ్యూహాలకు పదును పెట్టడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశం. ఈ విస్తృత స్థాయి సమావేశానికి జనసేన ప్రజాప్రతినిధులు, కీలక నేతలు హాజరుకానున్నారు. పార్టీకి చెందిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు , శాసనసభ్యులు , ఎమ్మెల్సీలతో పాటు వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా ఎంపికైన నేతలకు పిలుపునిచ్చారు. వీటితో పాటు గత కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన సీనియర్లకు సముచిత ప్రాధాన్యం ఇస్తూ.. 2019 సార్వత్రిక ఎన్నికలు, 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసిన మాజీ అభ్యర్థులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపారు. ఈ వేదికగా స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాలు, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై రూపొందించిన 14 మంది సభ్యుల ప్రత్యేక కమిటీ సమగ్రంగా చర్చించనుంది. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్దేశించిన మార్గదర్శకాలను, ఆయన సందేశాన్ని పార్టీ పీఏసీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ నేతలకు కూలంకషంగా వివరించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి తరఫున సీట్ల సర్దుబాటు, అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు మరియు క్షేత్రస్థాయి సమన్వయంపై నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ నిలబడి పోరాడిన కేడర్‌కు స్థానిక సంస్థల్లో ప్రాధాన్యం కల్పించడంపై ఈ సమావేశంలో ప్రాథమిక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. గల్లీ స్థాయి నుంచి క్షేత్రస్థాయి నాయకత్వాన్ని రీచార్జ్ చేస్తూ, గ్రామ పంచాయతీ నుంచి జిల్లా పరిషత్, మున్సిపల్ పీఠాల వరకు విజయం సాధించడమే లక్ష్యంగా జనసేన వ్యూహరచన చేస్తోంది. పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అభ్యర్థులను ఖరారు చేయడంపై ఈ ఆత్మీయ సమావేశం ఒక దిక్సూచిలా మారబోతోంది. జనసేన 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో గత ఎన్నికల్లో గెలిచింది. అయితే ఈసారి మున్సిపల్, కార్పొరేషన్



ఎన్నికల్లో పట్టున్న ప్రాంతాలను ఎంచుకోవాలని జనసేన భావిస్తుంది. అందుకు అవసరమైతే టీడీపీపై వత్తిడి కొంత పెంచి ఎన్నికలలో పోటీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే పవన్ కల్యాణ్ వీరమహిళలు, జనసైనికులకు సంతృప్తి కలిగేలా వాటా ఉంటుందని, అదే సమయంలో కూటమి మధ్య మిత్రత్వాన్ని కొనసాగిస్తూనే అవసరమైన సీట్లను సాధించడం కోసం పట్టుబడతామని చెప్పింది. అయితే చూచాయగా అందిన సమాచారం మేరకు జనసేన ఏపీలోని పదహారు కార్పొరేషన్లలో ఐదింటిలో పోటీ చేయాలని భావిస్తుంది. ఇప్పటికే దీనిపై ఒక అభిప్రాయానికి వచ్చిన జనసేన కార్పొరేషన్ లలో తాము పోటీ చేసే స్థానాల విషయంలో క్లారిటీకి వచ్చినట్లు ఉందని పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ, కాకినాడ, తిరుపతి, ఒంగోలు,. ఏలూరు కార్పొరేషన్లనలో మేయర్ పదవిని జనసేన కోరే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే మొత్తం పదహారు కార్పొరేషన్లలలో ఐదు అంటే ఎక్కువేనని టీడీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. విజయవాడ కార్పొరేషన్ ను వదులుకునేందుకు టీడీపీ సిద్ధంగా ఉండదు. అలాగే ఏలూరు కార్పొరేషన్ విషయంలోనూ టీడీపీ పట్టుబట్టే అవకాశముంది. ఇక తిరుపతి విషయంలో గత శాసనసభ ఎన్నికల్లో అసెంబ్లీ స్థానం కేటాయించాం కాబట్టి ఈ సారి మేయర్ స్థానం తమకు ఇవ్వాలని జనసేన ముందు టీడీపీ కొంత ప్రతిపాదన పెట్టే అవకాశముంది. ఇక కాకినాడ కార్పొరేషన్ లో ఎటువంటి ఇబ్బందులు లేవు. అలాగే ఒంగోలు కార్పొరేషన్ ను కూడా టీడీపీ వదులుకునేందుకు సిద్ధపడకపోవచ్చు. అక్కడ పట్టు పోకుండా ఉండాలంటే కార్పొరేషన్ తమ గ్రిప్ లో ఉంచుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ పట్టుబట్టవచ్చు. ఇవి కాకుండా మిగిలిన చోటా చోటా కార్పొరేషన్లకు ఇచ్చేందుకు టీడీపీ సిద్ధపడవచ్చు. ఐదు కార్పొరేషన్లకు మూడు కార్పొరేషన్లు జనసేనకు కేటాయించే అవకాశాలున్నాయి. ఉత్తరాంధ్రలోనూ, రాయలసీమలోనూ కొన్ని చోట్ల కేటాయించే ఛాన్స్ ఉంది. అంతే తప్ప తమకు బలం ఉన్న స్థానాలను పొత్తులో భాగంగా వదులుకోకూడదన్న అభిప్రాయం కూడా టీడీపీ నేతల్లో ఉంది. ఐదు కార్పొరేషన్లు అడిగితే మూడు ఇస్తారన్నది జనసేన వ్యూహం కావచ్చు. అదే జరిగితే జనసేన కోరినవి కాకుండా దాని బలం అంచనా వేసి కాకినాడతో పాటు మరొక రెండు కార్పొరేషన్లు కోరే అవకాశముందని తెలిసింది. మొత్తం మీద జనసేన మాత్రం కొంత స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టిగానే స్థానాలను కోరాలని భావిస్తుంది. జనసేనఐదు కార్పొరేషన్లను తీసుకోగలిగితే 31.25 శాతం షేరింగ్ అవుతుంది. మరొకవైపు పవన్ కల్యాణ్ పై జనసైనికుల నుంచి కూడా ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో జనసేన ఏ రకంగా సీట్ల షేర్ సాధిస్తుందన్నది ఇప్పుడు అందరిలోనూ ఉత్కంఠ నెలొకొంది.

# రికార్డు స్థాయిలో బహుళార్థసాధక నీటిపారుదల ప్రాజెక్టు

పెన్ సత్తా

ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధిలో జలవనరుల మేనేజ్‌మెంట్ అత్యంత కీలకమైనది. తీవ్రమవుతున్న వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రతికూల ప్రభావాలు రాష్ట్ర వ్యవసాయ రంగంపై పడకుండా ఉండేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకే వారంలో దశాబ్దాలుగా నత్తనడకన సాగుతున్న రెండు బహుళార్థసాధక నీటిపారుదల ప్రాజెక్టుల్లో రికార్డు స్థాయిలో పనులను పూర్తి చేయించి, ప్రారంభోత్సవాలకు వేదిక సిద్ధం చేస్తున్నారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాల దాహార్తిని తీర్చే వెలిగొండ, ఉత్తరాంధ్ర ఆశల నిలయమైన పోలవరం ఎడమ కాలువ పనులను పరుగులు పెట్టించడం ద్వారా సర్కార్ తన పరిపాలనా సామర్థ్యాన్ని నిరూపించుకుంటోంది. రాయలసీమలోని ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు, ప్రకాశం , నెల్లూరు జిల్లాల సాగు, తాగునీటి అవసరాలకు జీవనాడిగా మారిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి టన్నెల్ పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్ నుంచి నల్లమల అడవుల గుండా నీటిని తరలించే ఈ సంక్లిష్టమైన ఇంజనీరింగ్ పనులను సీఎం చంద్రబాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రధానంగా తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనే ప్రకాశం జిల్లాలోని కంభం, మార్కాపురం, ఎర్రగొండపాలెం ప్రాంతాలకు తక్షణమే నీరందించడమే లక్ష్యంగా మైక్రో లెవెల్ ప్లానింగ్ అమలు చేస్తున్నారు.

టన్నెల్-1 ద్వారా కృష్ణా జలాలను తరలించి వేసవికి ముందే ప్రకాశం జిల్లా భూములను తడిపేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ప్రాజెక్టులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టడం కాదు.. మైక్రో లెవెల్ ప్లానింగ్, రోజువారీ పర్యవేక్షణతో గడువులోగా పూర్తి చేసి నీటిని అందించడమే అసలైన డెవలప్‌మెంట్ అన్నట్లుగా పనులు పరుగులు పెట్టిస్తున్నారు. మరోవైపు ఉత్తరాంధ్ర ఆర్థిక వికాసానికి మలుపు తిప్పే పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనుల పూర్తిపై జలవనరుల శాఖ రాత్రింబవళ్లు శ్రమిస్తోంది. గోదావరి వరద జలాలను పోలవరం ఎడమ కాలువ ద్వారా విశాఖపట్నం మెట్రోపాలిటన్ ప్రాంతానికి, అనకాపల్లి పారిశ్రామిక కారిడార్లకు తరలించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. గతంలో వదిలేసిన కాలువ గట్ల అనుసంధానం, గ్యాప్-1 , గ్యాప్-2 నిర్మాణ లోపాలను సాంకేతికంగా వేగంగా సరిదిద్దారు. ఈ పనులు పూర్తయితే అనకాపల్లి జిల్లాలోని ప్రధాన ఆయకట్టుకు సాగునీరు అందడమే కాకుండా, విశాఖ పరిధిలోని పారిశ్రామిక అవసరాలకు ఉచితంగా తాగు, పారిశ్రామిక నీరు సరఫరా కానుందిఈ రెండు కీలక ప్రాజెక్టులు అందుబాటులోకి రావడం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం పడనుంది. విశాఖ, అనకాపల్లి పారిశ్రామిక ప్రాంతాలకు నీటి భద్రత లభిస్తే మరిన్ని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్లు రాష్ట్రానికి తరలివస్తాయి. అదే సమయంలో, తీవ్ర ఫ్లోరైడ్ సమస్యతో అల్లాడుతున్న ప్రకాశం జిల్లా గ్రామాలకు

కృష్ణా జలాలు అందడం ద్వారా వేలాది మందికి శాశ్వత ఆరోగ్య లబ్ధి చేకూరుతుంది. ఎల్ నినో వల్ల వర్షాభావ పరిస్థితులు ఎదురైనా ఈ ప్రాజెక్టుల ద్వారా నీటిని నిల్వ చేసి సద్వినియోగం చేసుకోవచ్చని ప్రభుత్వం లెక్కిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాటల కంటే పనులకే ప్రాధాన్యత ఇస్తుందనే సందేశాన్ని ఈ ప్రాజెక్టుల వేగం చాటిచెబుతోంది. గత ప్రభుత్వంలో మందగించిన మౌలిక రంగాన్ని మళ్లీ పట్టాలెక్కించడం ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని పునరుద్ధరించడమే కాకుండా, రాబోయే రోజుల్లో 'వాటర్ మేనేజ్‌మెంట్'లో ఏపీని దేశానికే మోడల్‌గా నిలబెట్టాలనే ఆలోచనలో చంద్రబాబు ఉన్నారు. ఒకే వారంలో రెండు అతిపెద్ద ప్రాజెక్టులలో మైలురాళ్లను అధిగమించడం రాష్ట్ర జల వనరుల రంగానికి కొత్త ఊపిరి పోసిందనే చెప్పాలి.

# వారసులొస్తున్నారు.....

పెన్ సత్తా

ఏపీలో స్థానిక సమరానికి రంగం సిద్ధమవుతున్న వేళ రాజకీయ పార్టీల్లో కొత్త సమీకరణాలు మొదలైనట్లు కనిపిస్తోంది. అక్టోబరులో కొత్త ఓటర్ల జాబితా విడుదల కానున్న నేపథ్యంలో అంతకంటే ముందే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, మండల, జిల్లా పరిషత్‌లు, గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే దిశగా ఏర్పాట్లు సాగుతున్నాయనే ప్రచారం నేపథ్యంలో పార్టీల్లో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు మొదలైందిఈసారి స్థానిక ఎన్నికలను అధికార కూటమితో పాటు వైసీపీ కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకునే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. దీంతో బలమైన అభ్యర్థుల కోసం అన్వేషణ జరుగుతోంది. అయితే ఈసారి మరో ఆసక్తికరమైన అంశం తెరపైకి వస్తోంది. సీనియర్ నేతలు తమ స్థానంలో కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి తీసుకురావడానికి స్థానిక ఎన్నికలను అనుకూల వేదికగా చూస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేయర్, మున్సిపల్ చైర్మన్, జడ్పీ చైర్మన్ వంటి కీలక పదవులకు తమ కుమారులు, కుమార్తెలను పోటీ చేయించాలనే ఆలోచనలో పలువురు నేతలు ఉన్నట్లు సమాచారం. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం కష్టమైన పరిస్థితుల్లో స్థానిక ఎన్నికలు వారసులకు రాజకీయ అరంగేట్రం చేయించే అవకాశాన్ని కల్పిస్తున్నాయని నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. పైగా ఎన్నికల్లో ఆర్థికంగా, రాజకీయంగా పూర్తి స్థాయిలో సహకరించగల వ్యక్తిని బరిలోకి దించాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యుల వైపు మొగ్గు చూపుతున్నారని ప్రచారం జరుగుతోంది.

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ పలువురు సీనియర్ నాయకులు తమ వారసులకు టికెట్లు ఇప్పించేందుకు ప్రయత్నించారు. టీడీపీ , వైసీపీ రెండింటిలోనూ ఇలాంటి ఆశలు ఉన్నప్పటికీ, ఎన్నికల సమీకరణాలు, గెలుపు అవకాశాలను దృష్టిలో పెట్టుకునిఅన్ని చోట్లా వారసులకు అవకాశం ఇవ్వలేదు. అయినప్పటికీ యనమల రామకృష్ణుడు కుమార్తె దివ్య, టీజీ వెంకటేశ్ కుమారుడు భరత్, పేర్ని నాని కుమారుడు కిట్టూ, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు మోహిత్ వంటి వారికి రాజకీయ అవకాశం లభించింది. అదే సమయంలో పలువురు సీనియర్ నేతల వారసులకు మాత్రం గత ఎన్నికల్లో టికెట్లు దక్కలేదు. దీంతో ఇప్పుడు స్థానిక ఎన్నికలపై వారు ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేయర్, జడ్పీ చైర్మన్ వంటి పదవులు రాజకీయంగా మంచి గుర్తింపు ఇవ్వడంతో పాటు భవిష్యత్తులో పెద్ద పదవులకు వెళ్లేందుకు బలమైన పునాది అవుతాయని భావిస్తున్నారు. ఈ విషయంలో వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఇప్పటికే ముందడుగు వేశారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తన కుమార్తె అనూషను విజయనగరం జడ్పీ అభ్యర్థిగా ప్రకటించడం ద్వారా వారసత్వ రాజకీయాలకు స్థానిక ఎన్నికలే తదుపరి వేదిక అన్న సంకేతం ఇచ్చారని కొందరు భావిస్తున్నారు. దీంతో ఇతర జిల్లాల్లోని సీనియర్ నాయకులు కూడా తమ కుటుంబ సభ్యుల రాజకీయ భవిష్యత్తుపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఎన్నికల షెడ్యూల్ స్పష్టమైన తర్వాత ఈ వారసుల జాబితా మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# అనిల్ లో నిర్వేదం..

పెన్ సత్తా

పదవి ఉన్నా లేకపోయినా తనకో చరిత్ర ఉందని వైసీపీ ఆఫీసులో కూర్చుని పోసుకోలు కబుర్లు చెప్పిన అనిల్ కుమార్ మాటల నిర్వేదం వెనుక అసలు రహస్యం.. స్థానిక ఎన్నికల విషయంలో ఆయనకు నెల్లూరు సిటీలో అసలు బాధ్యతలే ఇవ్వకపోవడం. మున్సిపల్ ఎన్నికల్లో ఏకగ్రీవాలు జరిగితే తాను పోటీ చేయనంటూ ఆయన చేసిన ప్రకటనలు.. సొంతంగా బాధ్యత తీసుకోవడానికి చేసిన ప్రయత్నం అని వైసీపీ వర్గాలంటున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమన్వయ బాధ్యతలను పార్టీ అధిష్టానం ఆయనకు అప్పగించలేదు. ఆయన ఇంచార్జ్ కూడా కాదు. తాను ఏదో బాధ్యత తీసుకుంటున్నట్లు ఫోజు కొడుతూ చేసిన ప్రకటనలు కేవలం రాజకీయ ఉనికిని కాపాడుకునే ప్రయత్నమే. గత సార్వత్రిక ఎన్నికల నుంచి అనిల్ కుమార్ యాదవ్ రాజకీయ పరిస్థితి తలకిందులైంది. నెల్లూరు సిటీ నుంచి ఆయనను తప్పించి నరసరావుపేట ఎంపీగా బరిలోకి దించగా, అక్కడ ఘోర పరాజయం పాలైన తర్వాత ఆయన అటువైపు వెళ్లడం పూర్తిగా మానేశారు. తిరిగి తన సొంత ఇలాకా అయిన నెల్లూరులో పట్టు నిలుపుకుందామంటే, అక్కడ స్థానిక వైసీపీలో రెడ్డి నేతలు ఆయనను కనీసం కాలుమోపనివ్వకుండా అడ్డుకుంటోంది. దీంతో చేతిలో అసెంబ్లీ నియోజకవర్గం లేక, ఎంపీగా ఓడిపోయిన ప్రాంతానికి వెళ్లలేక అనిల్ తీవ్ర రాజకీయ శూన్యతను ఎదుర్కొంటున్నారు. మరోవైపు, నెల్లూరు సిటీ నియోజకవర్గంపై పట్టు బిగించేందుకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఇప్పటికే దూకుడు పెంచారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నెల్లూరు సిటీ టికెట్‌ను లక్ష్యంగా చేసుకున్న పర్వతరెడ్డి, తాజాగా స్థానిక సమరానికి సంబంధించి నెల్లూరు సిటీ బాధ్యతలన్నింటినీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనకే అప్పగించారంటూ బహిరంగంగా ట్వీట్ చేయడం అనిల్ వర్గానికి పెద్ద షాక్‌గా మారింది. కార్పొరేషన్ వ్యవహారాల్లో చక్రం తిప్పుదామనుకున్న అనిల్ ఆశలపై ఈ పరిణామం నీళ్లు చల్లినట్లయింది. పార్టీ పెద్దల నుంచి వచ్చిన ఈ స్పష్టమైన సంకేతంతో నెల్లూరు సిటీలో అనిల్‌కు రాజకీయంగా ద్వారాలు మూసుకుపోయినట్లేనని స్పష్టమవుతోంది. ఎలాగైనా తిరిగి నెల్లూరు సిటీ రాజకీయాల్లోకి రావాలని చూస్తున్న అనిల్ ప్రయత్నాలన్నీ వరుసగా బెడిసికొడుతున్నాయి. ఒకప్పుడు నెల్లూరు జిల్లా రాజకీయాల్లో మంత్రిగా చక్రం తిప్పి, ప్రత్యర్థులపై విరుచుకుపడిన ఆయన, నేడు సొంత పార్టీలోనే ఏ బాధ్యతా లేని స్థితికి దిగజారడం గమనార్హం. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సరైన నియోజకవర్గం లేక, నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల బాధ్యతలను సైతం ప్రత్యర్థి వర్గం దక్కించుకోవడంతో అనిల్ రాజకీయ భవిష్యత్తు పూర్తిగా అగమ్యగోచరంగా మారింది.

# విజయవాడలో 10 చోట్ల ఫ్రీగా వసతి, ఫుడ్

**పెన్ సత్తా** విజయవాడకు బతుకుదెరువు కోసం ప్రతి రోజూ ఎంతోమంది వస్తుంటారు. కూలీలు, కార్మికులు, చిరువ్యాపారులు.. ఇలా చాలామంది ఉంటారు. నగరంలో పలు ఎన్జీవోల సాయంతో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 10 చోట్ల ఏర్పాటు చేశారు. ఆధార్ కార్డు ఉంటే చాలు ఈ షెల్టర్లలో ఉచితంగా వసతి, తిండి సౌకర్యం ఉంటుంది. చాలామందికి వీటిపై అవగాహన ఉండటం లేదు.. అందుకే అవగాహన కూడా కల్పిస్తున్నారు. చాలామంది ఉపాధి కోసం, ఇతరత్రా పనుల కోసం ప్రతిరోజూ విజయవాడ వస్తుంటారు. అలా వచ్చినవారికి వసతి విషయంలో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. కొంతమంది లాడ్జి, హోటల్‌లో గదిని అద్దెకు తీసుకోవడానికి కూడా డబ్బులు లేని పరిస్థితుల్లో ఉంటారు. అలాంటి వారిలో చాలామంది రోడ్లు, బస్టాండ్లలో రాత్రిళ్లు పడుకునేవారు. ఇకపై ఎవరూ వసతి లేకుండా ఇబ్బందిపడకుండా విజయవాడలో సరికొత్త ఆలోచన చేశారు. విజయవాడలో ఉచితంగా ఆశ్రయం, భోజన సౌకర్యం కల్పిస్తున్నారు.. మున్సిపల్ సంస్థలు, ఎన్జీవోలు కలిసి ఉచితంగా వసతి కల్పిస్తున్నాయి. కేవలం ఆధార్ కార్డు ఉంటే సరిపోతుంది.. ఉచితంగా వసతి పొందొచ్చు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, మెప్మా, వివిధ ఎన్జీవోలు కలిసి ఉచితంగా వసతి కల్పించేందుకు ఆశ్రయాలు (షెల్టర్లు) ఏర్పాటు చేశారు. జాతీయ పట్టణ జీవనోపాధి పథకం కింద.. నగరంలోని రాణీగారితోట, వైఎస్సార్ కాలనీ, సీతన్నపేట, హనుమాన్ పేట, ఆంధ్రప్రభ కాలనీ, వడ్డెర కాలనీ, రూట్స్ హెల్త్ ఫౌండేషన్, మ్యాంగో మార్కెట్ వంటి పది ప్రాంతాల్లో ఈ ఉచిత షెల్టర్లు ఏర్పాట్లు చేశారు. వసతి పొందాలంటే ఆధార్ కార్డు చూపిస్తే చాలు రూపాయి కూడా తీసుకోకుండా 15 రోజుల పాటు ఉచితంగా వసతి కల్పిస్తారు. ఈ ఉచిత వసతి కల్పన గురించి విజయవాడ కార్పొరేషన్, ఎన్జీవో ప్రతినిధులు నగరంలో ప్రతిరోజూ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ఈ ఉచిత వసతిపై ప్రచారం చేస్తున్నారు. ఒకవేళ ఎవరికైనా కుటుంబం లేకపోతే.. వాళ్లకు ఇక్కడ దీర్ఘకాలికంగా ఆశ్రయం కల్పిస్తున్నారు.. వారికి సమయానికి తిండి పెడుతూ వసతి కల్పిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారికి 15 నుంచి 20 రోజుల వరకు ఉచితంగా వసతి కల్పిస్తున్నారు. ఇక్కడ దీర్ఘకాలం పాటు నివసించడానికి అవకాశం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. రోడ్లపై నిద్రించాల్సి వచ్చే వారి కోసమే ఈ షెల్టర్లు ఏర్పాటు చేశారని.. కానీ చాలామందికి అవగాహన లేకపోవడంతో ఇక్కడికి రావడం లేదంటున్నారు. అలాగే చాలామంది రోడ్లపై భోజనం పంపిణీ చేస్తుండటంతో ఈ షెల్టర్ల వైపు చూడంట లేదని చెబుతున్నారు. కాబట్టి ఎవరైనా ఆహారం, దుస్తులు, వస్తువులు పంపిణీ చేయాలనుకుంటే నేరుగా ఈ షెల్టర్లకు వచ్చి ఇస్తే బావుంటుందంటున్నారు.

# హీట్ పుట్టిస్తున్న పులివెందుల




**పెన్ సత్తా** ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాయలసీమ రాజకీయాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో సరికొత్త పొలిటికల్ హీట్ మొదలైంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి దశాబ్దాలుగా తిరుగులేని కోటగా, అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సొంత గడ్డగా ఉన్న పులివెందుల మున్సిపాలిటీని ఈసారి ఎలాగైనా కైవసం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం పక్కా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం, రాష్ట్రవ్యాప్తంగా సానుకూల వాతావరణం నెలకొనడంతో.. పులివెందుల పురపాలక సంఘంపై పసుపు జెండా ఎగురవేయడమే లక్ష్యంగా టీడీపీ అడుగులు వేస్తోంది. ఈ మెగా పొలిటికల్ మిషన్‌ను విజయవంతం చేసేందుకు టీడీపీ సీనియర్ నాయకుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి క్షేత్రస్థాయిలో సీరియస్ ఫోకస్ పెట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పులివెందులలోని ప్రతి వార్డులోనూ కూటమి శ్రేణులను ఏకం చేస్తూ, వైకాపాకు గట్టి పోటీ ఇచ్చే బలమైన అభ్యర్థులను రంగంలోకి దించేందుకు ఆయన వ్యూహాత్మకంగా కసరత్తులు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో వైకాపా అవినీతిని, గత ఐదేళ్ల వైఫల్యాలను ఎండగడుతూ.. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సూపర్ సిక్స్ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళుతున్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌ల పూర్తి మద్దతుతో బీటెక్ రవి దూసుకుపోతుండటం ఇక్కడి రాజకీయాలలో ఊహించని మార్పులకు దారితీస్తోంది. రాజకీయ విశ్లేషకుల అంచనాల ప్రకారం.. ఈసారి పులివెందుల మున్సిపాలిటీని కాపాడుకోవడం వైఎస్ జగన్‌కు అంత సులువైన వ్యవహారం కాదు. గత స్థానిక ఎన్నికల్లో అధికార బలంతో ఏకగ్రీవాలు చేసుకున్న వైకాపాకు, ఈసారి కూటమి ప్రభుత్వం వంద శాతం పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తుండటం పెద్ద సవాల్‌గా మారింది. నియోజకవర్గంలో చాలామంది వైకాపా ద్వితీయ శ్రేణి నాయకులు, సామాన్య ఓటర్లు కూటమి వైపు మొగ్గు చూపుతుండటంతో జగన్ కోటలో బీటలు వారుతున్నాయి. పులివెందుల మున్సిపాలిటీని ఎలాగైనా గెలిచి జగన్ సొంత నియోజకవర్గంలోనే ఆయనకు రాజకీయంగా పెద్ద షాక్ ఇవ్వాలని కూటమి కూకటివేళ్లతో కష్టపడుతోంది.

# మహా విధ్వంసం



ఆసుపత్రుల వెలుపల గోడలకు అంటించిన మృతుల ఫొటోలను చూస్తూ కన్నీరుమున్నీరు అవుతున్న జనాలు. తమ సామగ్రి కోసం బురదలో, శిథిలాల మధ్య వెతుకుతున్న కుటుంబాలు. దెబ్బతిన్న భవనాల గుండా పసిబిడ్డను ఎత్తుకొని వెళ్తున్న ఓ బాధిత మహిళ. శిథిలాల మధ్య పడి ఉన్న ఓ కుక్క కళేబరం. నేపాల్?ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు సృష్టించిన బీభత్సానికి ఇవి కొన్ని సజీవ సాక్ష్యాలు. మరోవైపు రోజులు గడుస్తున్న కొద్దీ గల్లంతైన వారి బంధువుల్లో ఆశలు ఆవిరి అవుతున్నాయి. మరోవైపు సహాయక బృందాలు అత్యంత ప్రతికూల వాతావరణంలోనూ ప్రాణాలకు తెగించి బాధితుల కోసం గాలిస్తున్నాయి. బుధవారం నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు ఒక్కసారిగా గ్రామాలు, పట్టణాలను ఊడ్చేసింది. వరద ఉద్ధృతికి ఇళ్లు, వాహనాలు, రోడ్లు, వంతెనలు అన్నీ కొట్టుకుపోయాయి. జలవిద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ పెను విపత్తు నుంచి కోలుకోవడానికి ఇప్పుడు నేపాల్ తీవ్రంగా శ్రమిస్తోంది.

### భారీగా పెరిగిన మృతుల సంఖ్య

శనివారం నాటికి నేపాల్‌లో మృతుల సంఖ్య 600 దాటగా, మరో 2400 మంది గల్లంతయ్యారు. పైగా వరద ప్రభావిత ప్రాంతాల్లో తరచూ వర్షాలు పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ రెస్క్యూ బృందాలు ఎంతో శ్రమించి 163 మంది విదేశీయులతోపాటు, దాదాపు 2500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరోవైపు ఆసుపత్రుల వెలుపల, చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వివరాలను చూసేందుకు కుటుంబాలు బారులు తీరుతున్నాయి. తమకు తెలిసిన వారు ఎవరైనా ఉన్నారేమోననే ఆశతో పేర్లు, ఫొటోలను ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారు. బతికున్న వారి జాబితాలో తమ వారి పేర్లు కనిపించకపోవడంతో, భారమైన హృదయంతో, మరణించిన వారి ఫొటోలు ఉన్న మరో జాబితా వైపు వెళ్తున్నారు. ఈ హృదయవిదారకమైన దృశ్యాలు చూపరులను కన్నీటి పర్యంతం చేస్తున్నాయి. కాగా, వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ సిబ్బంది రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా శ్రమిస్తున్నారు. వర్షాలను సైతం లెక్కచేయకుండా, బురదను తవ్వుకుంటూ గల్లంతైన వారి కోసం అన్వేషిస్తున్నారు.

అప్పర్ త్రిశూలి 3ఏ జలవిద్యుత్ ప్రాజెక్ట్ వద్ద వందలాది మంది కార్మికులు సొరంగంలో చిక్కుకుపోయారు. అక్కడ టన్నుల కొద్దీ బురద పేరుకుపోయింది. నేపాల్ హోంమంత్రి సుదన్ గురుంగ్ స్వయంగా ప్రొక్లైన్లతో ఆ బురద తొలగింపు పనులను పర్యవేక్షించారు. ఆ టన్నెల్‌లో చిక్కుకుపోయిన 350 మందిని నేపాల్ ఆర్మీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చినట్లు ఆన్?లైన్ ఖబర్? అనే న్యూస్ పోర్టల్ పేర్కొంది.

మధ్య నేపాల్‌లోని గ్రామాల్లో విధ్వంసం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. భవనాలు కొన్ని అడుగుల మేర బురదలో మునిగిపోయాయి. వాహనాలు సగం వరకు బురదలో కూరుకుపోయాయి. రోడ్లు, ఇతర మౌలిక వసతులు వరద ఉద్ధృతికి కొట్టుకుపోయాయి. ఇక ప్రాణాలతో బయటపడిన వారికి, ఉండడానికి ఓ చోటు, వైద్యం, పోయిన సామగ్రి వెతుక్కోవడం కష్టమైపోతోంది. నువాకోట్ జిల్లాలోని దేవిఘాట్ గ్రామంలో ప్రజలు మోకాళ్ల లోతు బురదలో, శిథిలాల గుండా నడుస్తూ తమ వస్తువుల కోసం వెతుకుతున్నారు. ఒక వ్యక్తి శిథిలాల గుండా గ్యాస్ సిలిండర్? మోసుకెళ్తున్నాడు. ఎందుకంటే అతను ఆ ముంపు నుంచి కాపాడుకోగలిగిన ఏకైక వస్తువు అది ఒక్కటే. ఎక్కడ చూసినా దెబ్బతిన్న ఇళ్లు, విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, పాడైపోయిన వాహనాలు కనిపిస్తున్నాయి. ఇది వరద సృష్టించిన మహా విధ్వంసాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. ప్రస్తుతం త్రిశూలిలో ఏర్పాటు చేసిన ఆర్మీ రిలీఫ్ క్యాంప్ బాధితులకు కాస్త ఆసరాగా మారింది. ఆర్మీ సిబ్బంది పిల్లలకు, వృద్ధులకు సాయం చేస్తున్నారు. వైద్యులు తాత్కాలిక వైద్య శిబిరాల్లో క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నారు. ఈ క్యాంప్?ల్లోనే గల్లంతైన, మరణించిన, రక్షించబడిన వారి వివరాలను అందిస్తున్నారు. సహాయక చర్యల కోసం 5000 మందికిపైగా నేపాల్ ఆర్మీ సిబ్బందితో కలిపి మొత్తం 11వేల మందికిపైగా భద్రతా సిబ్బంది రంగంలోకి దిగారు.

### మళ్లీ వర్షాలు కురిసే అవకాశం!

వాతావరణ శాఖ రానున్న రోజుల్లో సాధారణ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాయి. ఇది రెస్క్యూ సిబ్బంది పనిని మరింత కష్టతరం చేసే అవకాశం ఉంది. అయినప్పటికీ, గతంలో ఇలాంటి విపత్తులను ఎదుర్కొన్న అనుభవంతో, గల్లంతైనవారిని వెతకడం, బాధితులకు సహాయం చేయడం, పునర్నిర్మాణ ప్రక్రియను ప్రారంభించడంపై నేపాల్ దృష్టి సారించింది.

# హిమాలయాల్లో 'మంచు' ముప్పు



నేపాల్‌లో ఇటీవల సంభవించిన హిమానీనద విపత్తు భారత్‌కు మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. హిమాలయ పర్వతాల్లోని మంచు సరస్సులు బద్దలైతే ఎంతటి విధ్వంసం సంభవిస్తుందో నేపాల్ ఘటన స్పష్టం చేస్తోంది. అదే సమయంలో భారత్‌లో కూడా వందల సంఖ్యలో ప్రమాదకర హిమానీనద సరస్సులు ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. దీంతో వాటిపై నిరంతర నిఘా, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ఎంతవరకు సిద్ధంగా ఉన్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ సర్వే ప్రకారం, భారత హిమాలయ ప్రాంతంలో దాదాపు 7,500 హిమానీనద సరస్సులు ఉన్నాయి. వీటిలో సుమారు 10 శాతం కంటే దాదాపు 750 సరస్సులు సిక్కింలోనే ఉన్నట్లు అంచనా. వీటిలో 25 సరస్సులను అత్యంత ప్రమాదకరమైనవిగా గుర్తించారు. హిమాలయ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరగడం, మంచు కరుగుదల, వర్షపాతంలో మార్పులు వంటి పరిణామాలు ఆ సరస్సులపై ప్రభావం చూపుతున్నాయి.

### దిగువ ప్రాంతాల్లో విధ్వంసం!

హిమానీనదాల నుంచి కరిగిన మంచు, నీరు చేరి ఏర్పడే సరస్సులు కాలక్రమంగా భారీగా విస్తరించే అవకాశం ఉంటుంది. సరస్సులను చుట్టుముట్టిన మంచు, రాళ్ల గోడలు బలహీనపడితే ఒక్కసారిగా నీరు బయటకు రావచ్చు. దీనినే గ్లేషియల్ లేక్ ఔట్?బర్స్ట్?ఫ్లడ్(+శ్రీఎఫ్) అంటారు. ఇలాంటి వరదలకు భారీ నీటితోపాటు మట్టి, రాళ్లు, మంచు కూడా కలవడంతో దిగువ ప్రాంతాల్లో విధ్వంసం మరింత పెరుగుతుంది. అయితే భారత్?లో హిమానీనద సరస్సుల ముప్పు సిక్కింకే పరిమితం కాదు. గంగా నదీ పరివాహక ప్రాంతంలోనే సుమారు 4700 సరస్సులు ఉన్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. ఆ నదీ పరివాహక ప్రాంతం 2.5 లక్షల చదరపు కిలోమీటర్లకుపైగా విస్తరించి ఉంది. వీటిలో ఏదైనా అత్యంత ప్రమాదకర సరస్సు ఒక్కసారిగా బద్దలైతే దిగువ ప్రాంతాల్లోని గ్రామాలు, పట్టణాలు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర కీలక మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ముఖ్యంగా పర్వత ప్రాంతాల్లో లోయలు ఇరుకుగా ఉండటంతో వరద ప్రవాహం మరింత వేగంగా కిందకి దూసుకెళ్లే ప్రమాదం ఉంటుంది.

### సౌత్ లొనాక్ విపత్తు మర్చిపోలేం

భారత్ ఇప్పటికే ప్రమాదాన్ని చవిచూసింది. 2023 అక్టోబర్ 3వ తేదీన సిక్కింలోని సౌత్ లొనాక్ సరస్సులు వద్ద భారీ విపత్తు సంభవించింది. సరస్సులోకి భారీగా మంచు, రాళ్లు విరిగిపడటంతో ఒక్కసారిగా పెద్ద అల ఏర్పడింది. సుమారు 20 మీటర్ల ఎత్తున ఎగిసిన ఆ నీటి అల దిగువ ప్రాంతాల వైపు దూసుకెళ్లింది. ఆ వరద ప్రవాహానికి జల విద్యుత్ ప్రాజెక్టులు, వంతెనలు, రహదారులు, నివాస ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆ ఘటన హిమానీనద సరస్సుల ప్రమాద తీవ్రతను దేశం ముందు స్పష్టంగా ఉంచింది.

నేపాల్‌లో జరిగిన తాజా విపత్తు మరో కోణాన్ని బయటపెట్టింది. మంచు లేదా రాళ్లు విరిగిపడటం, ఆ తర్వాత భారీగా మట్టి, రాళ్ల ప్రవాహం ఏర్పడటం, తాత్కాలికంగా సరస్సు ఏర్పడటం, చివరకు ఆకస్మిక వరదగా మారడం, ఇలా ఒకదాని తర్వాత ఒకటి వరుసగా జరిగే ప్రమాదాలను క్యాస్కేడింగ్ హజార్డ్స్ అంటారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సభ్యుడు కృష్ణ వత్స ప్రకారం, ఇలాంటి పరిణామాలు చాలా వేగంగా చోటుచేసుకోవచ్చు. దిగువ ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేయడానికి చాలా తక్కువ సమయం ఉండే అవకాశం ఉంది. "ప్రస్తుతం హిమాలయాల్లో సుమారు 200 హిమానీనద సరస్సులు ఉండగా, వాటిలో కనీసం 50 నుంచి 60 వరకు అధిక ప్రమాదకరమైనవిగా వర్గీకరణ జరిగింది. ఉష్ణోగ్రతలు పెరిగి హిమానీనదాలు కరగడంతో సరస్సుల వంటి నిర్మాణాల్లో భారీ పరిమాణంలో కరిగిన నీరు పేరుకుపోతుంది. ఒకవేళ భూకంపం సంభవించినా లేదా సరస్సు గట్లలో పగుళ్లు ఏర్పడినా, ఎత్తైన ప్రదేశాల్లో ఉన్న నీరు అపారమైన వేగంతో కిందికి దూసుకువస్తుంది. ఇది ఆ ప్రవాహాన్ని ఉగ్రరూపం దాల్చే వరదగా మార్చి, దాని మార్గంలో ఉన్న ఇళ్లు, హోటళ్లు, రోడ్లు లేదా వంతెనలు వంటి ప్రతిదాన్నీ కొట్టుకుపోతుంది."

# బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై డబ్ల్యూహెచ్ఓ అలర్ట్

బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో జంతువులు, పక్షులలో ఈ వైరస్ కేసులు వేగంగా వ్యాప్తి చెందడంపై ఆందోళన వ్యక్తం చేసింది. జంతువుల నుంచి మానవులకు బర్డ్‌ఫ్లూ సోకే ప్రమాదం ఉందని అభిప్రాయపడింది. బర్డ్‌ఫ్లూను ఎదుర్కొనేందుకు ఆరోగ్య వ్యవస్థలను ముందస్తుగా సిద్ధం చేయాలని ఆసియా-పసిఫిక్ దేశాలకు సూచించింది. అయితే భారత్‌లో ప్రస్తుతం స్వైన్‌ఫ్లూ (ఎ1చీ1) కేసులు పెరుగుతున్న సమయంలోనే, డబ్ల్యూహెచ్ఓ బర్డ్‌ఫ్లూ అలర్ట్ ఇవ్వడంతో ఈ హెచ్చరికకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఆగస్టు 25- 27 వరకు డబ్ల్యూహెచ్ఓ ఆగ్నేయాసియా, పశ్చిమ పసిఫిక్ ప్రాంతీయ కార్యాలయాలు సంయుక్తంగా బర్డ్‌ఫ్లూ వైరస్ గురించి ఓ సమావేశాన్ని నిర్వహించాయి. ఈ మీటింగ్‌లో 150 మందికి పైగా ఇన్‌ఫ్లుయెంజా నిపుణులు, సైంటిస్టులు, ప్రజారోగ్య అధికారులు పాల్గొన్నారు. పక్షులలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తి కొనసాగుతుందని ప్రజారోగ్య నిపుణులు పేర్కొన్నారు. జంతువుల నుంచి మానవులకు ఈ వ్యాధి సోకే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇదే విషయంపై ఈటీవీ భారత్‌లో ఆరోగ్య నిపుణులు, సైంటిస్టులు, వైద్యులు మాట్లాడారు.



### లక్షణాలు ఏంటంటే?

బర్డ్‌ఫ్లూ సోకిన చాలా మంది రోగులలో జ్వరం, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తాయని అం టువ్యాధుల నిపుణురాలు, మెడికల్ మైక్రోబయాలజిస్ట్ డాక్టర్ మనాలి అగర్వాల్ తెలిపారు. ఈ లక్షణాలతో పాటు న్యూమో నియాకు సంబంధించిన లక్షణాలు కూడా కనిపిస్తాయని చెప్పారు. తరచుగా కనిపించే శ్వాసకోశేతర లక్షణాలలో విరేచ నాలు, వాంతులు, కడుపు నొప్పి ఉన్నాయని వివరించారు. ఈ మహమ్మారి నుంచి ప్రజలను కాపాడడానికి సన్నద్ధత చాలా కీలకమన్నారు. "ముందుగా బర్డ్‌ఫ్లూ అంటే ఏమిటో మనం అర్థం చేసుకోవాలి. ఇది ఇన్‌ఫ్లుయెంజా వైరస్ ఉప రకం. ఇది పక్షులు, క్షీరదాలకు సోకుతుంది. అరుదుగా మానవులకు కూడా సంక్రమిస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ సోకిన పక్షులు, ఇతర జంతువులతో సన్నిహితంగా ఉండటం, కలుషితమైన పరిసరాల వల్ల ఆ వ్యాధి మానవులకు సోకే ప్రమాదం ఉంది. మానవుల మధ్య ఈ వైరస్ సోకిన దాఖలాలు ఇప్పటివరకు లేవు. బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లను తాకడం, అనారోగ్యంతో ఉన్న కోళ్లను తినడం వల్ల మనుషులకు బర్డ్‌ఫ్లూ సోకే అవకాశం ఉంది. పక్షుల నుంచి మానవులకు బర్డ్‌ఫ్లూ శ్వాసకోశ మార్గం, జీర్ణకోశ మార్గం, కంటి పొర ద్వారా వ్యాపిస్తుంది" అని మనాలి అగర్వాల్ పేర్కొన్నారు.

### 'డబ్ల్యూహెచ్ఓ సూచనకు అలర్ట్‌గా చూడాలి'

బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన పిలుపును పరిస్థితికి ప్రతిస్పందనగా కాకుండా, మరో భిన్నమైన ఇన్‌ఫ్లుయెంజా ముప్పు గురించి ఇచ్చిన హెచ్చరికగా చూడాలని ప్రముఖ ఆరోగ్య నిపుణుడు, ఏషియన్ సొసైటీ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసిన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ తమోరిశ్ కోలే అభిప్రాయపడ్డారు. స్వైన్‌ఫ్లూ అనేది ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే ఒక కాలానుగుణ ఇన్‌ఫ్లుయెంజా వైరస్ అని తెలిపారు. అయితే బర్డ్‌ఫ్లూ మాత్రం వ్యాధి సోకిన పక్షుల నుంచి, లేదంటే కలుషితమైన పరిసరాల నుంచే మానవులకు వ్యాపిస్తుందని పేర్కొన్నారు. దేశంలో పెద్ద ఎత్తున పౌల్ట్రీ రంగం, పెంపుడు కోళ్లు, లైవ్ బర్డ్స్ మార్కెట్లు, వలస పక్షుల మార్గాల ఉన్నాయని చెప్పారు.

## ఖర్గే సభా వేదికను శుద్ధి చేయడం నేరమే

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ నిర్వహించిన వేదికను శుద్ధీకరణ చేసిన ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో జరిగిన ఆ ఘటన నేరమని అన్నారు. ఆ వ్యవహారంపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని డిమాండ్ చేశారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరారు. ఈ మేరకు దిల్లీలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో పలు వ్యాఖ్యలు చేశారు హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో ఆగస్టు 8వ తేదీన ఖర్గే కాంగ్రెస్ సభలో ప్రసంగించారు. ఆయన ప్రసంగం అనంతరం ఆగస్టు 10వ తేదీన కొందరు అక్కడ శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించినట్లు కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఆ ఘటనను ప్రస్తావించిన రాహుల్, శుద్ధీకరణ పేరుతో దళితులను అంటరానివారిగా చూపుతున్నారని విమర్శించారు. శుద్ధీకరణ అనేది అంటరానితనానికి మరో పేరు అంటూ అభిప్రాయపడ్డారు. 'దళితులు తాకకూడని వారు, అపవిత్రులు అన్న భావనను ఇది వ్యక్తం చేస్తోంది. రాజ్యాంగం అంటరానితనాన్ని నిషేధించింది. అలాంటి చర్యలు నేరం' అని రాహుల్ అన్నారు.

### 'బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు చెందిన వారే'

అయితే ఆ ఘటనలో ఆర్ఎస్ఎస్, బీజేపీకి చెందిన వారే ఉన్నారని, ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడు మహేంద్ర భట్ శుద్ధీకరణ కార్యక్రమాన్ని సమర్థించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. 'బీజేపీ ఉత్తరాఖండ్ అధ్యక్షుడే శుద్ధీకరణను సమర్థిస్తున్నారు. అదే సమయంలో ప్రధాని మోదీ తాను అన్ని కులాలకు చెందిన వ్యక్తినని చెబుతున్నారు. మరి దళిత నాయకుడికి జరిగిన అవమానంపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు' అంటూ ప్రశ్నించారు. ఇక ఆగస్టు 13వ తేదీన రాజ్యసభలో ఆ అంశాన్ని మల్లికార్జున ఖర్గే ప్రస్తావించారని రాహుల్ గాంధీ ప్రస్తావించారు. ఘటనకు పాల్పడిన వారిపై అంటరానితన నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఖర్గే డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 'కాంగ్రెస్ అధ్యక్షుడి తరఫున మేం న్యాయం కోరుతున్నాం. ఉత్తరాఖండ్‌లో ఖర్గేకు న్యాయం జరగాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయనకు న్యాయం జరిగే చూడాలి' అని రాహుల్ అన్నారు.


### 'దళితలను గౌరవించేందుకు బీజేపీ సిద్ధంగా లేదు'

ఘటనను కేవలం ఒక రాజకీయ వివాదంగా చూడకూడదని, దేశంలో కుల వివక్షకు సంబంధించిన సమస్యగా చూడాలని రాహుల్ కోరారు. దళితలను గౌరవించేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధంగా లేవని ఆరోపించారు. దేశంలో దళితులపై వివక్ష ఇంకా కొనసాగుతోందని అన్నారు. రాజ్యాంగం ఇలాంటి వివక్షను నిషేధించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో దళిత పిల్లలను పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రం చేయించడం, నేలలు ఊడ్చించడం వంటి ఘటనలు జరుగుతున్నాయంటూ ఆరోపణలు చేశారు. గ్రామాల్లో సామూహిక బావుల నుంచి దళితులకు నీళ్లు తీసుకునేందుకు అనుమతి ఇవ్వని ఘటనలు ఉన్నాయని కాంగ్రెస్ అగ్రనేత అన్నారు. కొన్ని టీ దుకాణాల్లో దళితుల కోసం ప్రత్యేకంగా పేపర్ లేదా ప్లాస్టిక్ కప్పులు, ఇతరుల కోసం గాజు కప్పులు ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. దళిత వరుడు గుర్రంపై ఊరేగింపుగా వెళ్లే సమయంలో దాడులకు గురవుతారనే భయంతో హెల్మెట్ ధరించే పరిస్థితులు కూడా ఉన్నాయని అన్నారు. ఇదే మన దేశ వాస్తవ పరిస్థితి అంటూ వ్యాఖ్యానించారు.

### 'రెండు సిద్ధాంతాల మధ్య పోరాటం'

దేశంలో ప్రస్తుతం రెండు సిద్ధాంతాల మధ్య పోరాటం జరుగుతోందని రాహుల్ గాంధీ అన్నారు. ఒకవైపు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ వంటి నాయకుల ఆలోచనలతో రూపొందిన రాజ్యాంగం ఉందని, మరోవైపు బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. 'వేల సంవత్సరాలుగా దళితులపై హింస, వివక్ష కొనసాగింది. రాజ్యాంగం దాన్ని చట్టవిరుద్ధం చేసింది. అయినప్పటికీ నేటికీ ఇలాంటి ఘటనలు కనిపిస్తున్నాయి' అని అన్నారు. అదే విషయాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాజస్థాన్ కాంగ్రెస్ నేత టికారామ్ జూలీ, కేంద్ర మాజీ మంత్రి జితిన్ రామ్? మాంఝీ వంటి దళిత నేతలు వేర్వేరు సందర్భాల్లో ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నారని రాహుల్ పేర్కొన్నారు. ఒక దళితుడు ఎంత విజయవంతమైతే, అతడిపై దాడులు అంత తీవ్రంగా ఉంటాయని అన్నారు. అయితే హల్ద్వానీ ఘటనపై కాంగ్రెస్ విమర్శలు చేయడాన్ని ఇప్పటికే బీజేపీ ఖండించింది. పార్టీ ఇలాంటి కార్యకలాపాలను సమర్థించదని కేంద్ర మంత్రి జేపీ నడ్డా గతంలో స్పష్టం చేశారు. ఘటనపై దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## ఎల్ఓసీ వద్ద పాక్ డ్రోన్ కలకలం



జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ డ్రోన్ సంచారం కలకలం రేపింది. ఎల్ఓసీ వెంబడి మెంధర్ సెక్టార్‌లోని బాలాకోట్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి డ్రోన్ చక్కర్లు కొట్టడాన్ని భద్రతా దళాలు గుర్తించాయి. దీంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు సరిహద్దు జిల్లాలను జల్లెడపడుతున్నాయి. డ్రోన్ ఏదైనా అనుమానాస్పద వస్తువులను జారవిడిచిందా? లేదా ఏమైనా తీసుకెళ్లిందా? అనే కోణంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అధికారుల తెలిపిన వివరాల ప్రకారం, బాలాకోట్ ప్రాంతంలోని బెహ్రూటి గ్రామం వద్ద రాత్రి 8:05 గంటల ప్రాంతంలో ఓ డ్రోన్ కనిపించింది. కొంతసేపు ఆ ప్రాంతంలో చక్కర్లు కొట్టిన డ్రోన్, అనంతరం సరిహద్దుకు సమీపంలోని మంగళ్‌నార్-డబ్రోట్ వైపు కదిలినట్లు అధికారులు గుర్తించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే తిరిగి పాకిస్థాన్ వైపు వెళ్లిపోయినట్లు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన బలగాలు నిఘాను మరింత పెంచాయి. తెల్లవారుజామున రంగంలోకి దిగి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. అలాగే సరిహద్దు ప్రాంతంలో భద్రతా దళాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయని అధికారుల చెప్పారు. డ్రోన్ కదలికలపై నిఘా కొనసాగుతోందని, అనుమానాస్పదంగా ఏదైనా గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకునేందుకు బలగాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. పూంచ్‌తో పాటు జమ్ము ప్రాంతంలోని మరికొన్ని జిల్లాల్లోనూ భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఉధంపూర్, కఠువా, రాజౌరి జిల్లాల పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతాల్లో పోలీసులు, సైన్యం, సీఆర్పీఎఫ్ బలగాలు సంయుక్తంగా బరిలోకి దిగాయి. శుక్రవారం సాయంత్రం నుంచి ఉధంపూర్-కఠువా అటవీ బెల్ట్‌లోని కుబాన్, నగేన్, ఖత్రైల్, గోడు ఫలాల్, పదేతర్, చోర్ మొట్టు, కియా, ఖేబా, ఖేద్, మార్తా, జోఫర్ తదితర మారుమూల గ్రామాలను జల్లెడపడుతున్నాయి.

### ఇద్దరు సాయుధులు

ఇదే సమయంలో రాజౌరి జిల్లాలోని గైబాస్, మిథియాని, మోగ్లా, నర్లా ప్రాంతాల్లో ఇద్దరు సాయుధులు సంచరిస్తున్నట్లు గ్రామస్థులు సమాచారం ఇవ్వడంతో సైన్యం రంగంలోకి దిగింది. బలగాలు ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. దట్టమైన అడవులు, కొండ ప్రాంతాల గుండా గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. అనుమానితులు ఉగ్రవాదులై ఉండొచ్చన్న అనుమానంతో పోలీసులు, సైన్యం, పారామిలిటరీ బలగాలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు ఆ సాయుధుల గురించి ఎటువంటి సమాచారం లభించలేదు. ఈ ఏడాది ప్రారంభంలోనూ పాకిస్థాన్?కు చెందిన డ్రోన్లు జమ్ముకశ్మీర్?లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా భద్రతా దళాలు తిప్పికొట్టాయి. మార్చి 1న జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ వద్ద పాకిస్థాన్‌కు చెందిన డ్రోన్లు భారత గగనతలంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించాయి. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు సరిహద్దుల గుండా చొరబడేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, భారత భద్రతా దళాలు వాటిని ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నాయి. ప్రస్తుతం ఉధంపూర్, కఠువా, రాజౌరి, పూంచ్ జిల్లాల్లో కొనసాగుతున్న తనిఖీలతో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇదిలా ఉండగా కొంతకాలం క్రితం జమ్మూకశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి భారీగా మాదక ద్రవ్యాలు పట్టుబడ్డాయి. పాకిస్థాన్ నుంచి వచ్చిన డ్రోన్ ద్వారా వాటిని జారవిడిచినట్లు అధికారులు అనుమానించారు. ఫిబ్రవరి 13న అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో 6.5 కిలోలకు పైగా హెరాయిన్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. పట్టుబడిన మాదక ద్రవ్యాల విలువ రూ.40 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం జరిగిన ఈ ఘటనలో కూడా పాకిస్థాన్ డ్రోన్ 'ఏదైనా అనుమానాస్పద వస్తువు విడిచిందా' అనే విషయంపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## బిజినెస్

### ఏథర్ నుంచి మరో ఎలక్ట్రిక్ స్కూటర్.. రూ.లక్షకే 'కోణార్క్'



ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ మరో స్కూటర్‌ను విపణిలోకి విడుదల చేసింది. 'కోణార్క్' (ఌో్ష్టవతీ ఖశీఋతీఎ) పేరుతో తీసుకొచ్చిన ఈ స్కూటర్ ఎా, ౧ అనే రెండు వేరియంట్స్‌లో లభించనుంది. రూ.లక్ష ప్రారంభ ధరతో వీటిని అందుబాటులోకి తెచ్చింది. ఎస్ వేరియంట్‌లో మొత్తం నాలుగు మోడల్స్‌ను తీసుకొచ్చింది.

**బ్యాటరీ సామర్థ్యం, రేంజ్ ఇలా..**

2.1ఎెౌష్ట బ్యాటరీ సామర్థ్యం కలిగిన ఎా100 వేరియంట్ సింగిల్ ఛార్జ్‌తో 100 కి.మీ. (×ణజ) వరకూ ప్రయాణించవచ్చని కంపెనీ చెబుతోంది. అలాగే 2.7ఎెౌష్ట, 3.5ఎెౌష్ట బ్యాటరీ సామర్థ్యంతో పనిచేసే వేరియంట్స్ వరుసగా 125 కి.మీ. (×ణజ), 161 కి.మీ. (×ణజ) రేంజ్‌ను ఇవ్వనున్నాయి. వీటి టాప్ స్పీడ్ 70ఎఎజూష్ట. కోణార్క్ 450ఔ ఆన్‌బోర్డ్ ఛార్జర్‌తో రానుంది. దీనిని 900ఔ ఆఫ్ బోర్డ్ ఛార్జర్‌కు అనుసంధానించడం ద్వారా మొత్తం 1.35ఎౌ ఛార్జింగ్ సామర్థ్యాన్ని పొందవచ్చు. ఇంటి వద్ద 0-80శాతం ఛార్జ్ చేయడానికి ఎా100 వేరియంట్‌కు 4 గంటల సమయం, ఎా125కు 4గంటలా 30 నిమిషాలు, ఎా161కు 5గంటలా 40 నిమిషాల సమయ పడుతుందని కంపెనీ చెబుతోంది. అదే కంబైన్డ్ ఛార్జ్ సాయంతో ఈ సమయం సగానికి తగ్గుతుందట. కేవలం 10 నిమిషాలు ఛార్జ్ చేయడం ద్వారా 13కి.మీ. వరకూ ప్రయాణించవచ్చని ఏథర్ వెల్లడించింది. ఎా వేరియంట్‌లో 200 కి.మీ రేంజ్ ఇచ్చే మరో స్కూటర్‌ను కూడా తీసుకురానున్నట్లు ఏథర్ తెలిపింది.

**సమయం, పని భారం తగ్గించేలా..**

ఇటు వినియోగదారులు, అటు ఏథర్ సర్వీస్ సెంటర్‌లలోని టెక్నీషియన్స్ సమయం ఆదాయ చేయడం కోసం కోణార్క్ డిజైన్‌లో కీలక మార్పులు చేసినట్లు ఏథర్ చెబుతోంది. క్షేత్రస్థాయిలో ఏథర్ వాహనాల 26 లక్షల కి.మీ. డేటాను విశ్లేషించి, సరికొత్త ఛాసిస్, పవర్‌ట్రైన్, ఎలక్ట్రానిక్స్ ఆర్కిటెక్చర్‌తో వీటిని తీర్చిదిద్దినట్లు చెబుతోంది. వివిధ విడి భాగాల వినియోగాన్ని గణనీయంగా తగ్గించడం ద్వారా సర్వీసింగ్ చేసే సమయం ఆదా అవుతుందని, నిపుణుడైన టెక్నీషియన్ కేవలం 3 నిమిషాల్లో బ్యాటరీని ఊడదీసి, బిగించేలా తీర్చిదిద్దినట్లు తెలిపింది.

**అదనపు ఫీచర్లు..**

ఇక కోణార్క్ 31 లీటర్ల స్టోరేజ్ సామర్థ్యంతో రానుంది. 18ఔ యూఎస్‌బీ టైప్-సిపోర్ట్, అండర్ సీట్ ల్యాంప్, ఎా100 వేరియంట్‌కు 4.2 అంగుళాల డిస్‌ప్లే మిగిలిన వాటికి 7 అంగుళాల డిస్‌ప్లే ఇచ్చారు. పార్క్ అసిస్ట్ రివర్స్, ఆటోహోల్డ్ తదితర ఫీచర్లు కూడా ఉన్నాయి. కోణార్క్ జెడ్ వేరియంట్ అడ్వాన్స్డ్ ఎలక్ట్రానిక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఌాజుదీూ)తో రానుంది. అలాగే దీనికి మేజిక్ కీ ఇవ్వనున్నారు. స్కూటర్ లాక్, అన్‌లాక్‌ను యాప్ ద్వారా నియంత్రించవచ్చు. గూగుల్ మ్యాప్స్, వాట్సాప్‌లను కూడా జెడ్ వేరియంట్‌లో ఉపయోగించుకోవచ్చు. థెఫ్ట్ అలర్ట్, రైడ్ స్టాటిస్టిక్స్, ఫైండ్ మై స్కూటర్, ఛార్జింగ్ పర్యవేక్షణ, ఓటీఏ అప్‌డేట్స్ వంటి వాటికి జెడ్ వేరియంట్ సపోర్ట్ చేస్తుంది.

# జియో ఐపీవోకు సెబీ సై.. రూ.37,700 కోట్ల నిధుల సమీకరణ?

**న్యూఢిల్లీ :** భారతీయ స్టాక్ మార్కెట్ల చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూ రాబోతున్నది. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) డిజిటల్ సర్వీసెస్ విభాగం.. జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ప్రతిపాదనకు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ శుక్రవారం ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు సమాచారం జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్‌కు అందింది. ఈ ఏడాది జూన్‌లో ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూ కోసం సెబీకి జియో తమ డ్రాఫ్ట్ పేపర్లను దాఖలు చేసిన విషయం తెలిసిందే.

**ఇదీ సంగతి..**

ఐపీవో ప్రక్రియలో సెబీ ఆమోదమే కీలకం. ఆ తర్వాత సెబీ నిబంధనలకు లోబడి పబ్లిక్ ఇష్యూ పనులను కంపెనీలు మొదలుపెట్టవచ్చు. కాగా, ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా 3.8 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.37,700 కోట్లు)ను జియో సమీకరించనున్నది. దీంతో ఇప్పుడు హ్యుందాయ్ పేరిట ఉన్న భారతీయ అతిపెద్ద ఐపీవో (3.3 బిలియన్ డాలర్లు) రికార్డు కనుమరుగుకానున్నది. నిజానికి నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ఐపీవో రూ.30,000 కోట్లతో రాబోతున్నది. వచ్చే నెల ద్వితీయార్ధంలో ఉండొచ్చని అంచనా. కానీ ఇదికూడా జియో కంటే చిన్నదే. ఇదిలావుంటే డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ) ప్రకారం.. జియో ప్లాట్‌ఫామ్స్ 27 కోట్లదాకా ఫ్రెష్ ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నది. ఇవి ఇష్యూ తర్వాత కంపెనీ మొత్తం ఈక్విటీ బేస్‌లో దాదాపు 2.9 శాతానికి సమానం. ఇక సంస్థ విలువను సుమారు 137 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. కాగా, సాధారణ కార్పొరేట్ అవసరాలకేగాక జియో ప్లాట్‌ఫామ్స్ మెటీరియల్ సబ్సిడరీ అయిన రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ లిమిటెడ్‌కు సంబంధించిన కొన్ని బకాయిలను




పాక్షికంగాగానీ, పూర్తిస్థాయిలోగానీ చెల్లించేందుకు ఐపీవో నిధులను ఖర్చు చేయనున్నారు. ఈ ఏడాది జూన్ ఆఖరునాటికి జియో ఇన్ఫోకామ్ సబ్‌స్క్రైబర్లు 53.3 కోట్లకుపైనే ఉన్నారు. చైనా మొబైల్ తర్వాత వినియోగదారుల ఆధారంగా ప్రపంచంలో ఇదే రెండో అతిపెద్ద సంస్థ కావడం విశేషం.

**ఫుల్ డిమాండ్?**

జియో ఐపీవోకు ఇన్వెస్టర్ల నుంచి ముఖ్యంగా రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి పెద్ద ఎత్తున ఆదరణ లభిస్తుందన్న అంచనాలున్నాయి. దేశీయ టెలికాం మార్కెట్‌లో ఇప్పుడు జియోదే హవా అన్న సంగతి విదితమే. కన్సాలిడేషన్ మోడ్‌లో ఉన్న టెలికాం రంగంలో ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ మినహా ఉన్నవి మూడే ప్రైవేట్ రంగ కంపెనీలు. అందులో వొడాఫోన్ ఐడియా కంటే ఎయిర్‌టెల్‌తోనే జియోకు గట్టి పోటీ. ఇక 5జీ నెట్‌వర్క్ విస్తరణ, శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు సైతం దేశీయ టెలికాం కంపెనీలకు మదుపర్లలో డిమాండ్‌ను పెంచుతున్నాయి. ఈ క్రమంలో జియో పబ్లిక్ ఇష్యూ వైపే ఇప్పుడు మదుపర్ల చూపంతా ఉన్నదని చెప్పకతప్పదు.

## ముంబైలో పాలు మరింత ప్రియం.. సెప్టెంబర్ 1 నుంచి కొత్త ధరలు

ముంబై నగరవాసులకు పాలు మరింత ప్రియం కానున్నాయి. స్థానిక పశువుల షెడ్లు, డెయిరీల నుంచి నేరుగా సరఫరా చేసే 'టబెలా' పాల టోకు ధరను పెంచాలని ముంబై మిల్క్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ నిర్ణయించింది. సెప్టెంబర్ 1 నుంచి లీటర్ టోకు ధరను ప్రస్తుతం ఉన్న రూ.93 నుంచి రూ.102కు పెంచనుంది. అంటే లీటర్‌పై రూ.9 పెరుగుదల. ఈ ధరలు 2027 ఫిబ్రవరి 28 వరకు అమల్లో ఉంటాయి. టోకు ధర పెరగడంతో వినియోగదా రులపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రస్తుతం సుమారు రూ.100కు లభిస్తున్న ఈ పాలు.. కొత్త ధరల అమలుతో రిటైల్ మార్కెట్‌లో లీటర్‌కు దాదాపు రూ.110 వరకు చేరొచ్చని పలు నివేదికలు పేర్కొంటున్నాయి.

**ఎందుకు పెంచారంటే..**

పశువుల పెంపకం, పాల ఉత్పత్తికి సంబంధించిన ఖర్చులు భారీగా పెరగడమే ధరల సవరణకు ప్రధాన కారణమని అసోసియేషన్ వెల్లడించింది. పశుదాణాలో ఉపయోగించే ధాన్యాలు, చుని, శనగ చుని, మొక్కజొన్న, నూనెగింజల పిండి (ఆయిల్ కేక్స్), పచ్చి గడ్డి వంటి వాటి ధరలు గణనీయంగా పెరిగాయని తెలిపింది. కొన్ని దాణా పదార్థాల ధరలు ఏడాది వ్యవధిలో దాదాపు 25 శాతం వరకు పెరిగినట్లు అసోసియేషన్ పేర్కొంది. పశువుల నిర్వహణ, రవాణా తదితర ఖర్చులు కూడా పెరగడంతో పాత ధరలకు పాలు విక్రయించడం కష్టంగా మారిందని తెలిపింది.

**పండుగల వేళ మరింత భారం**

సెప్టెంబర్‌లో గణేశ్ చతుర్థి సహా పండుగల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ధరల పెంపు రావడం గమనార్హం. ఈ సమయంలో పాలు, పెరుగు, స్వీట్లు, లస్సీ, ఇతర పాల ఉత్పత్తులకు డిమాండ్ సాధారణంగా పెరుగుతుంది. దీంతో



పాలు మాత్రమే కాకుండా పాల ఆధారిత ఆహార పదార్థాల ధరలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది.

# డెవాల్డ్ బ్రెవిస్ విధ్వంసం.. జింబాబ్వేపై సౌతాఫ్రికా ఘన విజయం

పసికూన నమీబియా ఇచ్చిన షాక్ నుంచి తేరుకున్న సౌతాఫ్రికా టీ20 ట్రై సిరీస్‌లో బోణీ కొట్టింది. శనివారం విండ్‌హోక్ వేదికగా జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా జట్టు 7 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. జింబాబ్వే విధించిన 145 పరుగుల టార్గెట్‌ను సఫారీలు 13.4 ఓవర్లలోనే 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. డెవాల్డ్ బ్రెవిస్ (32 బంతుల్లో 75 నాటౌట్, 7 ఫోర్లు, 6 సిక్సర్లు) విధ్వంసం సృష్టించి ఒంటిచేత్తో జట్టుకు విజయాన్ని అందించాడు. ఓపెనర్లు ప్రిటోరియస్ (22), జోర్డాన్ హెర్మన్ (20) పర్వాలేదనిపించారు. జింబాబ్వే బౌలర్లలో బ్రాడ్ ఎవన్స్, బ్లెసింగ్ ముజరబానీ, నైమురి తలా ఒక వికెట్ పడగొట్టారు. అంతకముందు జింబాబ్వే 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ (34) టాప్ స్కోరర్ కాగా, మరుమనీ (13 బంతుల్లో 30, ఒక ఫోర్, మూడు సిక్సర్లు) ఆఖర్లో మెరవడంతో జింబాబ్వే గౌరవప్రదమైన స్కోరును సాధించింది. సౌతాఫ్రికా బౌలర్లలో డాన్ జాన్సెన్ 3 వికెట్లు తీయగా, సుబ్రయెన్ 2 వికెట్లు పడగొట్టాడు. ఈ విజయంతో సౌతాఫ్రికా సిరీస్‌లో బోణీ కొట్టగా, తర్వాతి మ్యాచ్ సోమవారం జింబాబ్వే, నమీబియా మధ్య జరగనుంది.



## స్పోర్ట్స్

### టీమిండియాకు గుడ్ న్యూస్.. యార్కర్ల కింగ్ వచ్చేస్తున్నాడు!



అఫ్గానిస్తాన్‌తో టీ20 సిరీస్‌కు ముందు టీమిండియాకు గుడ్ న్యూస్ అందింది. జింబాబ్వే పర్యటనలో గాయపడ్డ యువ ఫాస్ట్ బౌలర్, యార్కర్ల కింగ్ ప్రిన్స్ యాదవ్.. తిరిగి పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లు తెలుస్తోంది. ఆజ్ తక్ కథనం ప్రకారం.. ప్రిన్స్ యాదవ్ బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో తన ఫిట్‌నెస్ పరీక్షలను క్లియర్ చేసినట్లు సమాచారం. తద్వారా అఫ్గాన్‌తో సిరీస్ కోసం భారత జట్టు ఎంపికకు ప్రిన్స్ అందుబాటులో ఉండనున్నాడు. సెప్టెంబర్ 13 నుంచి ఈ సిరీస్ ప్రారంభం కానుంది.

ప్రిన్స్‌కు ఏమైందంటే?

హరారే వేదికగా జింబాబ్వేతో జరిగిన రెండో టీ20లో బౌలింగ్ చేస్తుండగా ప్రిన్స్ యాదవ్ తొడ కండరాలు పట్టేశాయి. దీంతో 2.2 ఓవర్లు బౌలింగ్ చేసి ఆట మధ్యలోనే మైదానాన్ని వీడాడు. ఆ తర్వాత మూడో టీ20కు అతడు దూరమయ్యాడు. అనంతరం ఈ ఢిల్లీ పేసర్ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్‌లో చేరి తన ఫిట్‌నెస్‌ను తిరిగి పొందాడు. కాగా ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ తరపున అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. దీంతో భారత సీనియర్ జట్టు సెలక్టర్ల నుంచి అతడికి పిలుపువచ్చింది. తనకు లభించిన అవకాశాన్ని ప్రిన్స్ రెండు చేతులా అందిపుచ్చుకున్నాడు. ఇప్పటివరకు భారత తరపున 3 వన్డేలు, 6 టీ20లు ఆడిన ప్రిన్స్ యాదవ్.. మొత్తంగా 13 వికెట్లు పడగొట్టాడు.ఇప్పుడు ఈ రైట్ ఆర్మ్ పేసర్ అఫ్గానిస్తాన్‌పై సత్తాచాటేందుకు సిద్ధమవుతున్నాడు.

# వైభవ్ సూర్యవంశీకి నో ఛాన్స్.. టీమిండియా నుంచి ఆ ఇద్దరికే చోటు!

టీమిండియా మాజీ వికెట్ కీపర్ బ్యాటర్ దినేష్ కార్తీక్ ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో టాప్ 5 ఆల్-ఫార్మాట్ ప్లేయర్లను ఎంచుకున్నాడు. ఈ జాబితాలో భారత టెస్టు, వన్డే కెప్టెన్ శుబ్‌మన్ గిల్‌కు అగ్రస్థానం దక్కింది. ఆ తర్వాత రెండో స్థానంలో ఆసీస్ స్టార్ ఓపెనర్ ట్రావిస్ హెడ్‌కు కార్తీక్ ఛాన్స్ ఇచ్చాడు. మూడు, నాలుగు స్థానాల్లో హ్యారీ బ్రూక్(ఇంగ్లండ్), యశస్వి జైశ్వాల్(భారత్)కు చోటు దక్కింది. చివరగా ఐదో స్థానంలో న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్రకు డీకే అవకాశమిచ్చాడు. కాగా టాప్ ప్లేస్‌లో ఉన్న శుబ్‌మన్ గిల్ గత కొంత కాలంగా వన్డే, టెస్టుల్లోనూ నిలకడగా రాణిస్తున్నాడు. భారత టీ20 జట్టుకు అతడు దూరంగా ఉన్నప్పటికి ఐపీఎల్ వంటి ఫ్రాంచైజీ లీగ్స్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఈ కారణంగానే గిల్‌ను ఆల్‌ఫార్మాట్ ప్లేయర్‌గా కార్తీక్ ఎంపిక చేశాడు. ట్రావిస్ హెడ్ కూడా మూడు ఫార్మాట్లలోనూ ఆసీస్‌కు కీలక ప్లేయర్‌గా మారాడు. తన దూకుడు బ్యాటింగ్‌తో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసే సత్తా అతడిది. ఇక ఇంగ్లండ్ పరిమిత ఓవర్ల కెప్టెన్ హ్యారీ బ్రూక్ కూడా వన్డే, టీ20లతో పాటు టెస్టుల్లో కూడా మ్యాచ్ విన్నింగ్ నాక్స్ ఆడుతున్నాడు. ప్రస్తుతం పాక్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లోనూ దుమ్ములేపుతున్నాడు. అయితే యశస్వి జైశ్వాల్, రచిన్ రవీంద్రలు మాత్రం గత కొంతకాలంగా తమస్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతు న్నారు. అయినప్పటికి డికే వారికి బెస్ట్ ఆల్ ఫార్మాట్ ప్లేయర్ల జాబితాలో అవకాశమిచ్చాడు. కాగా ఈ లిస్ట్‌లో భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి చోటు ఇచ్చి ఉంటే బాగుండేది అని క్రికెట్ ఫ్యాన్స్ అభిప్రాయ పడుతున్నారు. ఎందుకంటే 15 ఏళ్ల వైభవ్ ఇప్పటికే టెస్టు,



వన్డే, టీ20 ఫార్మాట్లలో తన సత్తాను నిరూపించుకున్నాడు. అయితే వైభవ్ ఇంకా భారత జట్టు తరపున టెస్టు, వన్డే డెబ్యూ చేయనుందున కార్తీక్ ఈ లిస్ట్‌లో చోటు ఇవ్వలేదు.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
ప్రశ్నించడం అందరి హక్కు...
PEN SATTA Telugu Daily
ఆదివారం 30 ఆగస్టు 2026

## సంపాదకీయం

# అణు గొడుగుపై అనుమానం

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో జపాన్, దక్షిణ కొరియా (ఆర్ఓకే), ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్‌లకు ద్వైపాక్షిక రక్షణ ఒప్పందాల ద్వారా అమెరికా అధికారిక భద్రతా హామీదారుగా ఉంది. ఈ దేశాల వ్యూహాత్మక ప్రణాళికాకర్తలకు, అమెరికా హామీల్లో 'అణు గొడుగు' అని పిలిచే 'విస్తృత అణు నిరోధం' (ఎండ్) కూడా భాగమే. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో సోవియట్ యూనియన్, చైనానుంచి వచ్చే ముప్పుల నుంచి తన అణ్వస్త్రరహిత మిత్రదేశాలను రక్షించడానికి అమెరికా ఈ 'ఎండ్' విధానాన్ని రూపొందించింది. మిత్రదేశాలు సొంతంగా అణ్వాయుధాలు నిర్మించుకోవాల్సిన అవసరం లేదని, భారీ దురాక్రమణ జరిగితే అణు ప్రతిచర్యతో బెదిరించి అమెరికాయే నిరోధిస్తుందని ఒప్పించడమే దీని లక్ష్యం. అయితే, గత పదేళ్లలో ప్రపంచ వ్యూహాత్మక పరిస్థితి మరింత అనిశ్చితంగా మారింది. దీర్ఘకాలంగా స్థిరపడిన భద్రతా కూటములు లోపలి నుంచే సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. అఫ్గానిస్తాన్‌ను అమెరికా వదిలేయడం, ఉక్రెయిన్-రష్యా సంఘర్షణలో తన పాత్రను భద్రతా బలవర్ధకుడి నుంచి ఆయుధ విక్రేతగా మార్చుకోవడం, తైవాన్‌ను చైనా దురాక్రమణ నుంచి రక్షించడంపై అధ్యక్షుడు ట్రంప్ అస్పష్టమైన వ్యాఖ్యలు చేయడం.. ఇవన్నీ దక్షిణ కొరియా, జపాన్ వ్యూహాత్మక వర్గాల్లో అమెరికా అణు గొడుగుపై విశ్వసనీయతపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. 2025 ఏప్రిల్‌లో అసాహి షింబున్ సర్వేలో, సైనిక సంక్షోభంలో అమెరికా జపాన్‌ను రక్షిస్తుందని కేవలం 15 శాతం జపనీయులే నమ్ముతుండగా, 77 శాతం నమ్మడం లేదని తేలింది. 2025 ఆగస్టు టోక్యో విశ్వవిద్యాలయం సర్వేలో, జపాన్‌కు అమెరికా అణు గొడుగు రక్షణ ఉందని కేవలం 39.3 శాతం మంది మాత్రమే అంగీకరించారు. ఇది ఏడాది క్రితంతో పోలిస్తే 5.5 శాతం తగ్గుదల.


దక్షిణ కొరియాకు చైనా, ఉత్తర కొరియా అనే రెండు అణ్వాయుధ దేశాలు పొరుగుదేశాలుగా ఉన్నాయి. ఉత్తర కొరియా అణ్వస్త్రీకరణ ఎన్నటికీ జరగదన్నది వాస్తవిక అంచనా. దీన్ని నిరోధించడానికి దక్షిణ కొరియా వద్ద ఉన్న ఒక ఎంపిక.. 1991లో ఉపసంహరించుకున్న అమెరికా వ్యూహాత్మక అణు ఫిరంగి గోళాలను తిరిగి మోహరించడం. మరో దీర్ఘకాలిక ఎంపిక.. సొంత అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకునే సామర్థ్యాన్ని పెంచుకోవడం. 1954 నాటి, 2015లో సవరించిన అమెరికా-దక్షిణ కొరియా అణు సహకార ఒప్పందం ప్రకారం, తన అణు రియాక్టర్ల నుంచి వచ్చే వాడిన ఇంధనాన్ని రీప్రాసెస్ చేయడానికి లేదా యురేనియంను శుద్ధి చేయడానికి దక్షిణ కొరియాకు అనుమతి లేదు. దక్షిణ కొరియా వద్ద 5 లక్షలకుపైగా వాడిన ఇంధన కట్టలు నిల్వలున్నాయి. ఇది తన మొత్తం నిల్వ సామర్థ్యంలో 98.1 శాతాన్ని ఆక్రమిస్తోంది. 2025 ఆగస్టులో అధ్యక్షులు ట్రంప్, లీ జే మ్యుంగ్ మధ్య జరిగిన శిఖరాగ్ర సమావేశంలో, రీప్రాసెసింగ్ హక్కుపై చర్చించాలని ఇద్దరు నేతలు అంగీకరించారు. జపాన్‌కు ఇలాంటి హక్కులు ఇప్పటికే ఉన్నాయి. ప్రస్తుతం దక్షిణ కొరియాలో అమెరికా కమాండర్లు 'ఆర్ఓకే/యూఎస్ కంబైన్డ్ ఫోర్సెస్ కమాండ్'కు నేతృత్వం వహిస్తుండగా, 28,000 మంది అమెరికా రక్షణ సిబ్బంది మోహరించి ఉన్నారు. వ్యూహాత్మక నిర్ణయాధికారంలో మరింత భాగస్వామ్యం కోరుతున్న దక్షిణ కొరియా డిమాండ్‌ను పాక్షికంగా సంతృప్తిపరచడానికి, 2023లో బైడెన్, యూన్ ద్వైపాక్షిక అణు సంప్రదింపుల బృందాన్ని ఏర్పాటు చేస్తూ వాషింగ్టన్ డిక్లరేషన్‌ను ఆమోదించారు.

జపాన్ విషయానికొస్తే, యురేనియం శుద్ధినుంచి వాడిన ఇంధన రీప్రాసెసింగ్ వరకూ మొత్తం అణు ఇంధన చక్రంపై పూర్తి పట్టు కలిగి ఉండటంతో, దీన్ని ఒక 'గుప్త అణు రాజ్యం'గా పరిగణిస్తారు. అణు పరీక్ష అవసరం లేకుండా, అత్యాధునిక కంప్యూటర్ సిమ్యులేషన్ల ఆధారంగా, విశ్వసనీయమైన క్రియాశీల అణు ఆయుధాగారాన్ని నిర్మించడానికి మూడు నుంచి ఐదేళ్లు పట్టవచ్చుని అంచనా. 1945లో హిరోషిమా, నాగసాకిపై జరిగిన అణుదాడుల అనంతరం, జపనీయుల అభిప్రాయం అణ్వాయుధాలకు తీవ్రంగా వ్యతిరేకంగా ఉంది. ప్రస్తుత సనయె తకైచి ప్రభుత్వ మద్దతుదారుల్లోనూ 56.7 శాతం అణ్వాయుధాల సముపార్జనను స్పష్టంగా వ్యతిరేకిస్తున్నారు. దక్షిణ కొరియాలో ఇటీవలి సర్వేలో 76.2 శాతం దీనికి అనుకూలంగా ఉండటానికి ఇది పూర్తి భిన్నం. 1967లో ఆమోదించిన జపాన్ 'మూడు అణ్వాయుధ రహిత సూత్రాలు' అణ్వాయుధాలను కలిగి ఉండటాన్ని, తయారు చేయడాన్ని, జపాన్ భూభాగంలోకి ప్రవేశపెట్టడాన్ని నిషేధిస్తాయి. అయితే, ఒక రహస్య ఒప్పందం కింద జపాన్ జలాల్లో ఉన్నప్పుడు అమెరికా నౌకాదళ నౌకలపై అణ్వాయుధాలను జపాన్ అనుమతిస్తూ వచ్చింది. ఉత్తర కొరియా క్షిపణి పరీక్షలు, చైనా సైనిక విస్తరణ జపనీయులను కలవరపెడుతున్నాయి. తైవాన్‌ను చైనా స్వాధీనం చేసుకుంటే తన భద్రతపై ప్రతికూల ప్రభావం పడుతుందని జపాన్ నమ్ముతోంది. తైవాన్‌కు, ఒకినావాకు మధ్య దూరం కేవలం 790 కిలోమీటర్లే.

2025 అక్టోబర్‌లో ఎల్‌డీపీ నాయకత్వం చేపట్టిన తర్వాత, ప్రధాని సనయె తకైచి దివంగత ప్రధాని షింజో అబేను పోలిన మరింత దృఢమైన భద్రతా విధానాన్ని అనుసరిస్తున్నారు. ఆగస్టు 6న హిరోషిమా స్మారక దినోత్సవంలో మాట్లాడుతూ, జపాన్ తన మూడు సూత్రాలను 'కొనసాగిస్తోంది'నని తకైచి పేర్కొన్నా, ఈ విధానం మారకుండా ఉంటుందని హామీ ఇవ్వకపోవడం గమనార్హం. రక్షణ మంత్రి షింజిరో కొయిజుమి, వేగంగా దిగజారుతున్న ప్రపంచ భద్రతా వాతావరణంలో అణు నిరోధంపై చర్చను నివారించలేమని వాదించారు. అయితే, అమెరికా జలాంతర్గామి క్షిపణి వాహక నౌకలు జపాన్ ఓడరేవులను సందర్శించనందున, తకైచి ప్రకటనలు ఆచరణలో పెద్దగా మార్పు తీసుకురాకపోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి శాశ్వత సభ్యదేశపు ఎన్నికైన అధ్యక్షుడు, తన మిత్రదేశమైన డెన్మార్క్ నుంచి గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటానని బెదిరించడం, క్యూబాపై కొనసాగుతున్న ఆర్థిక దిగ్బంధనం నేపథ్యంలో, జపాన్, దక్షిణ కొరియా నాయకత్వం ముందున్న మౌలిక ప్రశ్న ఏమిటంటే - చైనా లేదా ఉత్తర కొరియా అణు బెదిరింపులకు తమ భవిష్యత్ తరాలను బలహీనంగా వదిలేయగలరా అన్నదే. హిరోషిమా, నాగసాకి అణుదాడుల నుంచి 81 ఏళ్లు గడిచిన తర్వాత కూడా, ఈ ప్రశ్నను తప్పించుకోవడమే ఇప్పుడు ఒక వ్యూహాత్మక ఎంపికగా మారుతోంది. అమెరికా విస్తృత అణు నిరోధంపై విశ్వాసం సన్నగిల్లుతున్న ఈ తరుణంలో, జపాన్, దక్షిణ కొరియా తమ భద్రతా భవిష్యత్తును ఎలా రూపొందించుకుంటాయన్నది యావత్ ఇండో-పసిఫిక్ ప్రాంత వ్యూహాత్మక సమతుల్యతకూ కీలకమైన ప్రశ్నగా నిలుస్తోంది.

## పనికొచ్చే పలుకు



# అలాగైతే.. మీరు ఇంటిలిజెంటే..!

జీవితంలో నిజంగా ఏం కావాలో తెలుసుకోవడం, దాన్ని ఎలా సాధించాలో ప్రణాళిక వేసుకోవడం, సాధించేందుకు కావాల్సిన పనిని క్రమం తప్పకుండా చేయడం.. ఈ మూడు చేయగలిగితే, మీరే తెలివైనవారే. వినడానికి సులువుగా ఉన్నా.. ఆచరణ అంత ఈజీ కాదు. మనలో చాలామంది "నాకు కావాలి" అనే కోరికతోనే గడిపేస్తారు తప్ప, ఏం కావాలో స్పష్టంగా నిర్వచించుకోరు. నిజంగా ఏంకావాలో తెలుసుకోవడం అనుకున్నంత సులభం కాదు. మీ వ్యక్తిగత, నిర్దిష్ట కోరికపై నిజమైన స్పష్టత రావాలంటే, మిమ్మల్ని మీరు నిజాయితీగా ప్రశ్నించుకోవాలి. "ఈ లక్ష్యం నాకు నిజంగా సంతోషాన్నిస్తుందా? లేక ఇతరులను మెప్పించడానికేనా?" అని. ఈ ప్రశ్నకు నిజాయితీగా సమాధానం దొరికినప్పుడే, మీ అసలైన లక్ష్యం స్పష్టమవుతుంది. రెండో దశ.. ప్రణాళిక వేసుకోవడం. ఇక్కడే చాలామంది తడబడతారు. ఫ్రెంచ్ రచయిత, పైలట్ ఆంతోన్ డి సెయింట్-ఎగ్జుపెరీకి తరచూ ఆపాదించే ఒక ప్రసిద్ధ మాట ఉంది: A goal without a plan is just a wish. అంటే, ప్రణాళిక లేని లక్ష్యం కేవలం కోరిక మాత్రమేనని. కల మాత్రమే ఉంటే సరిపోదు, దాన్ని చేరుకునే మార్గాన్ని నిర్దుష్టంగా గీసుకోవాలి. "నేను బరువు తగ్గాలి" అనేది కోరిక, కానీ "వారానికి ఐదు రోజులు 30 నిమిషాలు వ్యాయామం చేస్తాను, భోజనంలో చక్కెర తగ్గిస్తాను" అనేది ప్రణాళిక. ఈ తేడాను గుర్తించడమే విజయానికి తొలి మెట్టు.

మూడో దశ.. క్రమం తప్పని ఆచరణ. ఇదే అత్యంత కీలకమైనది, కష్టమైనది కూడా. ఎందుకంటే, ప్రేరణ ఎప్పుడూ స్థిరంగా ఉండదు. కొన్ని రోజులు మీకు అమితమైన ఉత్సాహం ఉంటుంది. మరికొన్ని రోజులు ఏమీ చేయాలనిపించదు. ఇక్కడే క్రమశిక్షణ ప్రేరణ కంటే ఎక్కువ ముఖ్యమైనదిగా మారుతుంది. మీరు మూడ్‌తో సంబంధం లేకుండా, రోజూ ఆ చిన్న అడుగును వేస్తూ ఉంటేనే, కాలక్రమేణా అది పెద్ద మార్పుగా రూపాంతరం చెందుతుంది.

స్పష్టత లేనప్పుడు మనం శక్తిని అనేక దిశల్లో వృథా చేస్తాం. ఇది అలసటకు, నిరాశకు దారితీస్తుంది. లక్ష్యం స్పష్టంగా ఉంటే, ప్రతి నిర్ణయం సులభమవుతుంది. ఎందుకంటే "ఇది నా లక్ష్యానికి దగ్గర చేస్తుందా, దూరం చేస్తుందా" అని మాత్రమే ప్రశ్నించుకుంటే సరిపోతుంది. రెండోది, ప్రణాళిక లేకపోతే ప్రతిరోజూ "ఈరోజు ఏం చేయాలి" అని ఆలోచించడంలోనే మానసిక శక్తి వృథా అవుతుంది. ముందుగానే ప్రణాళిక వేసుకుంటే, ఆ శక్తిని అమలుకే వినియోగించవచ్చు. మూడోది, స్థిరత్వం లేకుండా ఎంత గొప్ప ప్రణాళిక ఉన్నా అది కాగితంపైనే మిగిలిపోతుంది. చిన్న, స్థిరమైన అడుగులే దీర్ఘకాలంలో అతిపెద్ద మార్పులను తీసుకొస్తాయి. సో, ప్రతి ఆదివారం, వచ్చే వారానికి మీ ముఖ్యమైన మూడు లక్ష్యాలను రాసుకోండి. ప్రతి లక్ష్యానికి, దాన్ని సాధించడానికి రోజువారీగా చేయాల్సిన నిర్దుష్ట పనిని గుర్తించండి. ఆ పనిని క్యాలెండర్‌లో ఒక అపాయింట్‌మెంట్‌లా షెడ్యూల్ చేసుకోండి. ఇది కేవలం ఆలోచనగా మిగిలిపోకుండా, కార్యాచరణగా మారుతుంది. ప్రతి రాత్రి నిద్రపోయేముందు, ఆ రోజు మీరు వేసిన అడుగును ఒక్కసారి సమీక్షించుకోండి. దీనివల్ల మీ పురోగతిపై స్పష్టత లభిస్తుంది.

గుర్తుంచుకోండి - మేధావితనం అంటే అత్యధిక తెలివితేటలు కలిగి ఉండటం కాదు, ఇది జీవితంలో సరళమైన మూడు సూత్రాలను స్థిరంగా ఆచరించే సామర్థ్యం. మీకు ఏం కావాలో తెలుసుకోండి, దాన్ని చేరుకునే మార్గాన్ని గీసుకోండి, ఆ మార్గంలో ప్రతిరోజూ ముందుకు సాగండి - ఇదే నిజమైన తెలివి, ఇదే నిజమైన విజయానికి రహదారి.


# వెలిగొండ జలస్వప్నం సాకారం!



మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారం కానుంది. ప్రకాశం పశ్చిమ ప్రాంతంతోపాటు మార్కాపురం, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల్లోని కరవు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు కృష్ణా జలాలను అందించాలన్న మహత్తర లక్ష్యంతో చేపట్టిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను ఆగస్టు 31న ప్రారంభించి నీటిని విడుదల చేయనున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. వెలిగొండ కేవలం ఒక సాగునీటి ప్రాజెక్టు కాదు.. దశాబ్దాలుగా కరవుతో అల్లాడుతున్న ప్రాంతాలకు జీవనాడిగా, తాగునీటి సమస్యకు పరిష్కారంగా, వ్యవసాయానికి కొత్త ఊపిరిగా భావిస్తున్న ప్రాజెక్టు. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని ఎగువ ప్రాంతాలు తక్కువ వర్షపాతం, అనిశ్చిత వర్షాలతో గత ఐదు దశాబ్దాలుగా తీవ్ర కరవును ఎదుర్కొంటున్నాయని కాగ్ నివేదిక కూడా పేర్కొంది. ఈ పరిస్థితికి శాశ్వత పరిష్కారంగా 1991లోనే ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం మొదలుకాగా, 1994లో తొలి డీపీఆర్ సిద్ధమైంది. 1996 మార్చి 5న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే స్వయంగా వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం విశేషం. అయితే, కేంద్ర అనుమతులు, అటవీ ప్రాంత సమస్యలు, సాంకేతిక సవాళ్లతో పనులు వెంటనే వేగం అందుకోలేదు. 2004లో మరోసారి శంకుస్థాపన జరిగి, 2005లో అధికారికంగా ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, 2006లో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నల్లమల కొండల మధ్య శ్రీశైలం జలాశయం నుంచి కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు తరలించేందుకు సుమారు 18.8 కిలోమీటర్ల పొడవైన రెండు సొరంగాలు తవ్వాల్సి రావడం, ఈ ప్రాజెక్టును దేశంలోని అత్యంత క్లిష్టమైన నీటిపారుదల పనుల్లో ఒకటిగా నిలిపింది.

2014లో రాష్ట్ర విభజన తర్వాత వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడం మరోసారి ప్రధాన అంశంగా మారింది. చంద్రబాబు ప్రభుత్వం పనులను వేగవంతం చేయగా, 2018 నాటికి మొదటి సొరంగం పనుల్లో గణనీయమైన పురోగతి నమోదైంది. తదుపరి కాలంలో మొదటి సొరంగం పూర్తికాగా, రెండో సొరంగం తవ్వకం కూడా పూర్తయ్యే దశకు చేరింది. 2024-25 నాటికి రెండు సొరంగాలకు సంబంధించిన కీలక పనులు పూర్తయ్యాయి. అయితే, సొరంగాలు పూర్తవడం మాత్రమే సరిపోదు, వాటినుంచి నల్లమలసాగర్‌కు నీరు చేరేందుకు హెడ్ రెగ్యులేటర్లు, అప్రోచ్ చానల్, ఫీడర్ కెనాల్, మెయిన్ కెనాల్స్, లైనింగ్ వంటి అనేక పనులు పూర్తిచేయాల్సి వచ్చింది. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెలిగొండను అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుగా తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు పనుల పురోగతిపై తరచూ సమీక్షలు నిర్వహిస్తూ కచ్చితమైన గడువులను నిర్దేశించారు. 2026 ఫిబ్రవరిలో మార్కాపురం పర్యటన సందర్భంగా తొలి దశను జూలైనాటికి పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించాలనే లక్ష్యాన్ని ప్రకటించారు. అదే నెలలో రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకూ శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.9,081 కోట్లకు చేరగా, ఇప్పటికే వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ప్రభుత్వం, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసేందుకు నిధులు కేటాయించింది. ప్రాజెక్టు రెండు దశల్లో అమలు కానుంది -తొలి దశ పూర్తయితే మార్కాపురం ప్రాంతానికి ప్రధానంగా ప్రయోజనం చేకూరుతూ, సుమారు 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, దాదాపు 4 లక్షల మందికి తాగునీరు అందనుంది. పూర్తి ప్రాజెక్టు అమల్లోకి వస్తే సుమారు 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 15.25 లక్షల మందికి తాగునీరు అందించడం లక్ష్యం. దాదాపు 30 మండలాల్లోని కరవు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు ఇది ప్రయోజనం చేకూర్చనుంది.

వెలిగొండ ప్రాజెక్టు ప్రత్యేకత దాని నీటి తరలింపు వ్యవస్థలోనే దాగివుంది. శ్రీశైలం జలాశయం ఎగువ ప్రాంతంలోని కొల్లంవాగు సమీపంనుంచి కృష్ణా నది వరద జలాలను మళ్లించి, నల్లమల కొండల గుండా సొరంగాల ద్వారా నల్లమలసాగర్‌కు తరలిస్తారు. సుమారు 43.5 టీఎంసీ కృష్ణా వరద జలాలను వినియోగించాలనే లక్ష్యంతో ఈ వ్యవస్థను రూపొందించారు. అక్కడి నుంచి తీగలేరు, గొట్టిపడియ, ఈస్టర్న్ మెయిన్ కెనాల్‌వంటి కాలువల ద్వారా సాగు, తాగునీటి అవసరాలకు నీటిని తరలిస్తారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని కొండల లోపల సొరంగాల ద్వారా నీటిని తరలించడం ఈ ప్రాజెక్టు రూపకల్పనలో కీలక అంశంగా నిలిచింది. వెలిగొండ కథలో మరో ముఖ్యమైన కోణం నిర్వాసితులది. ప్రాజెక్టు నిర్మాణం కోసం తమ భూములు, ఇళ్లు, గ్రామాలను వదులుకోవాల్సి వచ్చిన కుటుంబాల త్యాగం లేకుండా ఈ జల స్వప్నం సాకారం కాదు. అందుకే ప్రాజెక్టు ప్రారంభానికి ముందు పునరావాస పరిహారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఆగస్టు 22న మూడో విడతగా రూ.250 కోట్ల పరిహారం అందించగా, మూడు విడతల్లో కలిపి 6,206 కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారం అందింది, ఇది పునరావాస పనుల్లో సుమారు 85 శాతం పూర్తయినట్టు సూచిస్తుంది. నీరు వచ్చిన ప్రాంతంలో కేవలం పంటలు మాత్రమే పెరగవు - గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మొత్తం మారుతుంది. రైతుల ఆదాయానికి స్థిరత్వం వస్తుంది. పాడి పరిశ్రమ, చిన్న వ్యాపారాలు, రవాణావంటి రంగాలకు ఊతం లభిస్తుంది. భూగర్భజలాలపై ఆధారపడటం తగ్గడంతో బోర్లు, విద్యుత్ వినియోగంపై ఒత్తిడి కూడా తగ్గుతుంది. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సురక్షితమైన ఉపరితల జలాలు అందుబాటులోకి వస్తే ప్రజారోగ్య పరంగానూ దీర్ఘకాలిక ప్రయోజనం ఉంటుంది. 1996లో శంకుస్థాపన చేసిన చంద్రబాబు నాయుడు, ఇప్పుడు మూడు దశాబ్దాల తర్వాత తొలి దశను స్వయంగా ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నానని ఆయనే ప్రస్తావించడం విశేషం. అయితే, వెలిగొండ ప్రయాణం ఒక్క ప్రభుత్వానికి లేదా ఒక్క నాయకుడికి మాత్రమే పరిమితం కాదు మూడు దశాబ్దాలుగా అనేక ప్రభుత్వాలు, ఇంజినీర్లు, కార్మికులు, ప్రజాప్రతినిధులు ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగమయ్యారు. మధ్యలో వచ్చిన ఆటంకాలు, ఆలస్యాలు, రాజకీయ మార్పులు, సాంకేతిక సవాళ్లు అన్నింటినీ దాటి ప్రాజెక్టు ఈ దశకు చేరుకుంది. అందుకే ఆగస్టు 31 కేవలం ఒక ప్రాజెక్టు ప్రారంభోత్సవ తేదీ కాదు. కరవు ప్రాంతాల ప్రజల దీర్ఘకాల నిరీక్షణకు ముగింపు పలికే రోజు. నల్లమల కొండలను దాటి కృష్ణమ్మ తొలిసారి ఈ కరవు నేలలను పలకరించే చారిత్రక సందర్భం. మూడు దశాబ్దాల క్రితం వేసిన విత్తనం నేడు జలధారగా మారబోతోంది. 1.19 లక్షల ఎకరాలకు తొలి దశలో నీరు, భవిష్యత్తులో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 15.25 లక్షల మందికి తాగునీరు అందించే భరోసానిస్తూ, ప్రకాశం పశ్చిమ ప్రాంతం నుంచి మార్కాపురం, నెల్లూరు, కడప వరకు విస్తరించే ఈ జలప్రయాణం కేవలం పొలాలను తడపడం కాదు.. దశాబ్దాలుగా కరవుతో పోరాడుతున్న ప్రజల జీవితాల్లో కొత్త ఆశలను నింపే ప్రయాణం. అందుకే వెలిగొండ తొలి దశ ప్రారంభం, ఆంధ్రప్రదేశ్ జలచరిత్రలో ఒక చిరస్మరణీయ మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది. ■



ఇంటర్నెట్ మన జీవితాలను సులభతరం చేయడమే కాకుండా, మన అలవాట్లను, ఓర్పునూ మార్చేసింది. ఒకప్పుడు ఎవరితోనైనా మాట్లాడాలంటే ఓపికగా వేచి చూసే వాళ్లం. కానీ, ఇప్పుడు రిప్లై కాస్త ఆలస్యమైతేనే ఏదో జరిగిపోయిందని కంగారు పడుతున్నాం. ఖాళీ దొరికితే చాలు ఆటోమేటిక్గా ఫోన్ చూస్తున్నాం. సమాచారం, వినోదం ఇలా ప్రతిదీ వెంటనే రావాలనుకోవడం మనలోని సహనాన్ని పూర్తిగా తగ్గించేస్తోంది. ఇంటర్నెట్ వేగాన్ని మనం అందిపుచ్చుకున్నామేమో గానీ, జీవితంలో నిజమైన సంతృప్తినిచ్చే నిదానాన్ని మాత్రం కోల్పోయాం. ఓపిక అనేది ఇప్పుడు అరుదైన నైపుణ్యంగా మారింది - దాన్ని తిరిగి పెంచుకోవడమే మన ముందున్న అసలైన సవాలు.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# యంత్ర మానవుడి మెరుపు వేగం!



చైనా రోబోటిక్స్ దిగ్గజం 'యూనీట్రీ' రూపొందించిన 'సూపర్‌మ్యాన్' హ్యూమనాయిడ్ రోబో, చరిత్రలోనే అత్యంత వేగవంతమైన మనిషిగా పేరొందిన ఉసేన్ బోల్ట్ రికార్డును అధిగమించింది. ఆగస్టు 17న విడుదల చేసిన వీడియోలో, ఈ రోబో గంటకు 45.6 కిలోమీటర్ల వేగంతో (సెకనుకు 12.66 మీటర్లు) పరుగెత్తడం చూపించారు. బోల్ట్ నమోదు చేసిన గంటకు 44.17 కిలోమీటర్ల వేగాన్ని ఇది మించిపోయింది. వికారంగా కనిపించే బాహ్య రూపమున్నా, ఈ రోబో ఏకంగా 2 మీటర్ల ఎత్తు నిలువు దూకుడు కూడా ప్రదర్శించి, కాళ్లపై స్థిరంగా దిగడం విశేషం. 2021లో క్రిస్టోఫర్ స్పెల్ నెలకొల్పిన 1.7 మీటర్ల రికార్డును ఇది అధిగమించింది. అయితే, యూనీట్రీ వెల్లడించిన ఈ గణాంకాలను ఇంకా స్వతంత్రంగా ఎవరూ ధృవీకరించలేదు. కొన్ని నెలల క్రితం డజన్ల కొద్దీ రోబోలతో సమకాలీకరించిన మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శనతో సంచలనం సృష్టించిన యూనీట్రీ, అదే సమయంలో కొన్ని రోబోలు అనూహ్యంగా ప్రవర్తించి మనుషులను కొట్టడంతో వివాదాన్ని కూడా మూటగట్టుకుంది. అలాంటిదేమీ జరగలేదుగానీ, ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన హ్యూమనాయిడ్ రోబో అలా ప్రవర్తిస్తే మాత్రం పరిస్థితి ఊహించుకోండి!




# 'కింగ్ 100'తో నాగ్ మనీ గేమ్

అక్కినేని నాగార్జున నుంచి కెరీర్ బెంచ్ మార్క్ ప్రాజెక్టు 100 రావాల్సి ఉంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి.. నాగ్ బర్త్ డే స్పెషల్‌గా మేకర్స్ గ్లింప్స్ విడుదల చేశారు. అభిమానులు అంచనాలకి తగ్గకుండా.. రొటీన్‌కి భిన్నంగా ఫ్రెష్‌గా ఉందన్న టాక్ గ్లింప్‌పై వినిపిస్తోంది.

మనుషులు రెండు రకాలు అంటూ డబ్బున్నోళ్ళు, డబ్బులేనోళ్ళు అనే వ్యత్యాసంం నుంచి మొదలు పెట్టి ఇందులో కింగ్ నాగ్ డబ్బుతో ఆడే ఆటగా దర్శకుడు కార్తీక్ చాలా స్టైలిష్ అండ్ రిచ్ విజువల్స్, టేకింగ్‌తో ఇంప్రెస్ చేసారని చెప్పొచ్చు. నాగార్జున అదే హ్యాండ్సమ్ అవతార్‌లో ఇంకా యంగ్ అండ్ స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. ఇక ఇందులో దేవిశ్రీ ప్రసాద్ స్కోర్ కూడా మంచి రిఫ్రెషింగ్‌గా ఉండడం విశేషం. ఇలా ఒక స్టైలిష్ అండ్ మాస్ గ్లింప్స్‌తో మేకర్స్ ఈ చిత్రాన్ని ఈ ఏడాది డిసెంబర్ 24న థియేటర్స్‌లో విడుదల చేస్తున్నట్టుగా ఖరారు చేశారు.




# రెండు ఓటీటీ ఫ్లాట్‌ఫామ్స్‌పై డీసీ..

హీరోగా మారిన తమిళ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ నుంచి వచ్చిన లేటెస్ట్ చిత్రం 'డిసి'. తెలుగు, తమిళ్‌లో భారీ హిట్‌గా నిలిచిన సినిమాతో హీరోగా లోకేష్ కనగరాజ్ క్రేజీ వెల్కమ్ అందుకున్నాడు. ఇక ఈ సినిమా థియేటర్స్‌లో సాలిడ్ రన్‌ని కంటిన్యూ చేసి ఎట్టకేలకి ఇప్పుడు ఓటీటీ రిలీజ్‌కి సిద్ధమైంది. ఈ చిత్రాన్ని ఒకటి కాదు రెండు ఓటీటీ ప్లాట్ ఫామ్‌లు స్ట్రీమింగ్‌కి తీసుకొస్తాయి అని టాక్ వినిపించిన నేపథ్యంలో వీటిలో ఒకటి అధికారిక అనౌన్సమెంట్‌ని ఇచ్చేసింది. సన్ నెక్ట్ వారు డీసీ చిత్రాన్ని అనధికారికంగా వినిపించిన డేట్ సెప్టెంబర్ 4నుంచే అందుబాటులోకి తెస్తున్నట్టుగా ఖరారు చేశారు. అయితే ఇందులో కేవలం తమిళ్‌లోనే రావచ్చని మొదట వినిపించింది కానీ ట్విస్ట్ ఇస్తూ వీరు తమిళ్‌తో పాటుగా తెలుగు, ఇంకా మలయాళం భాషల్లో కూడా చిత్రాన్ని తెస్తున్నట్టు తెలిపారు. సో ఈ డేట్ వరకు ఫ్యాన్స్ ఆగితే సరిపోతుంది. అలాగే ప్రైమ్ వీడియో వారినుంచి అధికారిక క్లారిటీ రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి అనిరుథ్ సంగీతం అందించగా సన్ పిక్చర్స్ నిర్మాణం వహించారు.

## ఫోటో స్టార్!



సాన్వీ మేఘన


# తదుపరి ఏ హీరోతో..?

'ఇరుముడి'తో మరోసారి దర్శకుడిగా ప్రతిభను చాటుకున్న శివ నిర్వాణ.. ఇప్పుడు తదుపరి ప్రాజెక్ట్‌ను ఎవరితో చేయబోతున్నారనే చర్చ టాలీవుడ్, కోలీవుడ్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఒకవైపు కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, మరోవైపు నటుడు ధనుష్.. ఇక వీరిద్దరితోపాటు అక్కినేని నాగచైతన్య పేరు కూడా శివ నిర్వాణ నెక్ట్ ప్రాజెక్ట్ రేసులో వినిపిస్తోంది. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ఎప్పటినుంచో ఓ స్ట్రెయిట్ తెలుగు సినిమా చేయాలనే ఆసక్తితో ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. శివ నిర్వాణ ఎమోషనల్ స్టోరీటెల్లింగ్, ఆయన దర్శకత్వ ప్రతిభపై సూర్యకు మంచి అభిప్రాయం ఉందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. సూర్య ఇమేజ్, బాడీ లాంగ్వేజ్‌కు సరిపోయే పక్కా కథ సిద్ధమైతే వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా పట్టాలెక్కే అవకాశాలు ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. మరోవైపు కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ సైతం శివ నిర్వాణ దర్శకత్వ ప్రతిభపై ఆసక్తి చూపుతున్నట్టు చర్చ సాగుతోంది. 'ఇరుముడి' చిత్రాన్ని చూసిన ధనుష్.. అందులో శివ నిర్వాణ పనితీరును మెచ్చుకున్నారని సమాచారం. తన ఇమేజ్‌కు, నటనకు తగ్గట్టుగా బలమైన కథ సిద్ధమైతే కలిసి పనిచేయడానికి ఆయన సానుకూలంగా ఉన్నట్టు టాలీవుడ్, కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ఇద్దరితో పాటు అక్కినేని నాగచైతన్యతో శివ నిర్వాణ మరోసారి చేతులు కలిపే అవకాశాలను కూడా కొట్టిపారేయలేం. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'మజిలీ' చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకోవడంతోపాటు బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. ముఖ్యంగా ఎమోషనల్ లవ్ స్టోరీగా ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న ఈ సినిమా.. శివ నిర్వాణ-నాగచైతన్య కాంబినేషన్‌కు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. వీరిద్దరి మధ్య ఉన్న మంచి అనుబంధం, సాన్నిహిత్యం కారణంగా మరోసారి ఈ హిట్ కాంబినేషన్ రిపీట్ అయ్యే అవకాశాలు కూడా ఉన్నట్టు సినీ వర్గాలు భావిస్తున్నాయి. సరైన కథ దొరికితే నాగచైతన్యతో మరో సినిమా చేయడానికి శివ నిర్వాణ ఆసక్తి చూపవచ్చని టాక్. అటు పాన్-ఇండియా స్టార్ సూర్య, విభిన్నమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ధనుష్, ఇటు నాగచైతన్య.. ఇలా ముగ్గురు స్టార్ హీరోల పేర్లు శివ నిర్వాణ తదుపరి సినిమా విషయంలో వినిపిస్తుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.అయితే శివ నిర్వాణ తన వద్ద ఉన్న కథల్లో ఎవరికి ఏ కథ సరిగ్గా సరిపోతుందో చూసి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ ముగ్గురు హీరోల్లో ఎవరితో ఆయన ముందుగా చేతులు కలుపుతారు? ఎవరి కోసం పర్ఫెక్ట్ స్క్రిప్ట్ సిద్ధం చేస్తారు? అనే ప్రశ్నలు ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి.



# ప్యారడైజ్ నుంచి పక్కా ఊరమాస్..

ప్రస్తుతం టాలీవుడ్ సినిమా నుంచి రానున్న పలు అవైటెడ్ భారీ చిత్రాల్లో నాచురల్ స్టార్ నాని హీరోగా కయాదు లోహర్ హీరోయిన్‌గా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో చేస్తున్న మాసివ్ ప్రాజెక్ట్ 'ది ప్యారడైజ్' ఒకటి. భారీ అంచనాలు సెట్ చేసుకున్న సినిమాని ఆ అంచనాలకి ఏ మాత్రం తీసిపోకుండా నెక్ట్ లెవెల్లో ప్లాన్ చేస్తున్నారు. ఇక ఫైనల్‌గా సినిమా నుంచి అంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న రెండో సాంగ్ 'యేశ నాగుల' ఫుల్ వెర్షన్ వచ్చేసింది. తెలంగాణ ఫోక్ సాంగ్‌గా ఇది




చాలామందికి తెలుసు. అయితే ఇలాంటి ఓ బిగ్ ప్లాట్ ఫామ్‌పై పైగా అనిరుథ్‌లాంటి స్టార్ సంగీత దర్శకుడు నుంచి ఈ సాంగ్ కంపోజ్ చేసి రావడం మరింత స్పెషల్ గా మారింది. అయితే ఈ సాంగ్‌ని మేకర్స్ డల్లాస్‌లో లైవ్ పెర్ఫామెన్స్‌తో అక్కడ విడుదల చేసి అదరగొట్టారు. ఇక ఆన్లైన్‌లో ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఫ్యాన్స్‌కి పలు మ్యూజిక్ ప్లాట్ ఫామ్‌లలో అందుబాటులోకి తెచ్చేసారు. యూట్యూబ్‌కంటే ముందే అమెజాన్ మ్యూజిక్, స్పాటిఫైలాంటి ఇతర మ్యూజిక్ ప్లాట్ ఫామ్‌లలో అందుబాటులోకి వచ్చేసిన ఈ సాంగ్ ఫుల్ ఎనర్జిటిక్‌గా సాగిందని చెప్పవచ్చు. ఒరిజినాలిటీ ఎక్కడా మిస్ కాకుండా అనిరుథ్ క్లారిటీగా అంతకు మించిన మాస్ బీట్స్‌తో తననుంచి ఒక పక్కా ఊరమాస్ సాంగ్‌ని వదిలాడని చెప్పవచ్చు. ఇక థియేటర్స్‌లో డెఫినెట్‌గా ఈ సాంగ్ ఒక బ్లాస్ట్‌లా పేలుతుందని చెప్పడంలో కూడా ఎలాంటి సందేహం లేదు. ఈ సాంగ్‌లో స్టార్ బ్యూటీ కీర్తి సురేష్ నాని సరసన స్క్రీన్ షేర్ చేసుకుంది. ఇక ఈ చిత్రానికి ఎస్ఎల్‌వి సినిమాస్ నిర్మాణం వహించగా ఈ సెప్టెంబర్ 24న సినిమా గ్రాండ్‌గా విడుదల కాబోతుంది.

# 'ప్రళయ్'లోనే నా ఓనం పండుగ


గతేడాది 'లోక' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధించి సూపర్ ఉమెన్ అనిపించుకుంది మలయాళీ భామ కల్యాణి ప్రియదర్శన్. ఈ విజయ ఉత్సాహంలోనే ఆమె 'ప్రళయ్' అనే తన తొలి హిందీ సినిమాతో మరోసారి తెరపై మ్యాజిక్ చేయడానికి సన్నద్ధమవుతోంది. బాలీవుడ్ హీరో రణ్వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. జై మెహతా దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్ర షూటింగ్ ప్రారంభమైనట్టు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రీకరణలో తను కూడా పాల్గొన్నట్టు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టింది కల్యాణి. "ఈ ఓనంకి ముంబయిలోని 'ప్రళయ్'లో పూర్తిగా చిక్కుకుపోయాను. అందుకే కుటుంబంతో వేడుకలు లేవు. పండగ విశేషాలు లేవు. వాటికి



బదులుగా గత రెండు నెలల నుంచి కొత్త కొత్త విషయాలను తెలుసుకుంటున్నాన"ని అంటూ ఆ పోస్టులో పేర్కొంది. జాంబీ థ్రిల్లర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు.

# సోలోగా సత్తా చాటుకోవాలంటూ దీపికపై సెటైర్లు


దీపికా పదుకొనే ఇటీవల చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. తన కెరీర్‌లో ప్రభాస్ కంటే ఎక్కువ సినిమాలు చేశానని, సక్సెస్ విషయంలోనూ తనకంటూ ప్రత్యేక స్థానముందనే అర్థం వచ్చేలా ఆమె మాట్లాడినట్టు ప్రచారం జరగడంతో నెటిజన్ల నుంచి తీవ్ర స్పందన వ్యక్తమవుతోంది. ప్రభాస్‌ను భారతీయ సినీ పరిశ్రమలో భారీ అభిమాన గణం కలిగిన స్టార్‌గా అభిమానులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పాన్ ఇండియా స్థాయిలో వరుస భారీ చిత్రాలతో తన మార్కెట్‌ను విస్తరించుకున్న ప్రభాస్‌తో తనను పోల్చుకుంటూ దీపిక చేసిన వ్యాఖ్యలు కొందరు అభిమానులకు నచ్చడం లేదు. సాధారణంగా వివాదాలకు దూరంగా ఉండే ప్రభాస్‌ను పరోక్షంగా తక్కువ చేసి మాట్లాడినట్టు భావిస్తూ సోషల్ మీడియాలో పలువురు విమర్శలు చేస్తున్నారు.



దీపిక స్టార్‌డమ్, మార్కెట్‌పై సోషల్ మీడియాలో మరో ఆసక్తికరమైన చర్చ కూడా జరుగుతోంది. నిజంగానే తనకంటూ భారీ సోలో మార్కెట్ ఉందని భావిస్తే, పూర్తిస్థాయి లేడీ ఓరియెంటెడ్ సినిమాతో బాక్సాఫీస్ వద్ద తన సత్తాను నిరూపించుకోవాలని కొందరు నెటిజన్లు సూచిస్తున్నారు. గతంలో దీపిక ప్రధాన పాత్రలో వచ్చిన 'చప్పాక్' సినిమా బాక్సాఫీస్ వద్ద పరిమితస్థాయిలోనే వసూళ్లు సాధించింది. అయితే అది ప్రయోగాత్మక కథాంశంతో తెరకెక్కిన చిత్రం కావడం, అప్పటి పరిస్థితులు భిన్నంగా ఉండటం వంటి అంశాలను కూడా అభిమానులు ప్రస్తావిస్తున్నారు. ప్రస్తుతం ఆమె కెరీర్, క్రేజ్ మరింత పెరిగిన నేపథ్యంలో యాక్షన్ లేదా కమర్షియల్ అంశాలతో కూడిన భారీ లేడీ ఓరియెంటెడ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావాలని కొందరు సూచిస్తున్నారు.ఒకవేళ దీపిక సోలోగా నటించిన సినిమా వందల కోట్ల వసూళ్లు సాధిస్తే, ఆమె స్టార్ పవర్, బాక్సాఫీస్ స్టామినా గురించి మరింత స్పష్టమైన చర్చ జరుగుతుందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. స్టార్ హీరోలతో కలిసి చేసే సినిమాల్లో విజయాలను పోల్చుకోవడంకంటే, తన సొంత బలంతో భారీ విజయాన్ని అందుకోవడం ద్వారా తన మార్కెట్‌ను నిరూపించుకోవచ్చని కామెంట్లు చేస్తున్నారు.

## మనం చేయగలిగేది..
# దేవుడిని ప్రార్థించడమే

నేపాల్లో సంభవించిన భారీ వరదలపై బాలీవుడ్ అగ్రకథానాయకుడు అమితాబ్ బచ్చన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణ, ఆస్తి నష్టాల దృశ్యాలు తనను కలచివేస్తున్నాయని పోస్ట్ పెట్టారు. "నేపాల్లో సంభవించిన వరదల విధ్వంసాన్ని చూడటం బాధగా ఉంది.
ప్రకృతి కన్నెర్ర చేస్తే మనం తట్టుకోలేం. ఇలాంటి ప్రమాదాల్లో ఉపశమనానికి ఆ దైవానుగ్రహం ఎంతో



అవసరం. మనం చేయగలిగింది ఆ దేవుడిని ప్రార్థించడమే. ఎందుకంటే ఆయన శక్తి అన్నింటికంటే అతీతమైనది" అని తన బ్లాగ్‌లో అమితాబ్ పేర్కొన్నారు. ఇటీవల నేపాల్ లో సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా వందల మంది ప్రాణాలు కోల్పోగా, వేలమంది గల్లంతైన సంగతి తెలిసిందే. ఈ విధ్వంసంపై సినీ తారలు సోషల్ మీడియా వేదికగా స్పందిస్తున్నారు. సంజయ్ దత్, సోనూసూద్, మనీషా కోయిరాలా, శింబు విచారం వ్యక్తం చేస్తూ పోస్టు పెట్టారు. బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com